సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
మంగళవారం, 04.08.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 273
పేజీలు: 08 వెల: రూ. 5

# జాబ్‌క్యాలెండర్ ఎక్కడ?

## యువకులు ఆత్మహత్య చేసుకుంటున్నారు

### రాహుల్, రేవంత్, ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్

02

- యువతను మోసం చేశారు
- నిరుద్యోగులపై కాంగ్రెస్‌కు కేటీఆర్ ప్రశ్నలు
- ఆత్మహత్యలు వద్దు



**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కాలేదని, ముఖ్యంగా యువతను జాబ్ క్యాలెండర్ పేరుతో నిలువునా ముంచారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. చట్టసభల్లో పెట్టిన జాబ్ క్యాలెండర్ కూడా దిక్కులేదని విమర్శించారు. అందుకే యువత నిర్వేధంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని, ఎవరూ అధైర్య పడొద్దని హితవుపలికారు. " ఎన్నికల ముందు డిక్లరేషన్ల పేరుతో కాంగ్రెస్ మోసం. రాష్ట్రంలో నిరుద్యోగులు నిర్వేదంలో ఉన్నారు. కాంగ్రెస్ విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ఏమైంది?డిప్యూటీ సీఎం ఇలాకాలో యువకుడు లేఖ రాసి ఆత్మహత్యయత్నం మిగతా 02లో

# కుంభవృష్టి.. 6 నెలల్లో ప్రాణనష్టం

02

- రంగంలో మాతంగి స్వర్ణలత సంచలన భవిష్యవాణి హెచ్చరిక
- అగ్నిప్రమాదాలు సంభవిస్తాయి
- అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరగకపోతే ఆరు నెలల్లో ప్రాణనష్టం తప్పదు
- లష్కర్ బోనాల రంగంలో ప్రకృతి విపత్తులు, సామాజిక పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు
- భవిష్యవాణితో భక్తుల్లో చర్చ



# బీజేపీకి షాక్

## బంకిపూర్ ఉప ఎన్నికలో పీకే గెలుపు




- యువత తీర్పుతో బీజేపీకి ఎదురుదెబ్బ
- ఖాతా తెరిచిన జన్ సూరజ్

02

# కాంగ్రెస్ హ్యాట్రిక్ వ్యూహం

## మూడు టర్ములు లక్ష్యమన్న రేవంత్

### కాంగ్రెస్‌లో జోష్ పెంచిన రేవంత్



- తెలంగాణలో కాంగ్రెస్ ధీమా
- రేవంత్‌కు అనుకూల రాజకీయాలు
- కాంగ్రెస్ బలం పెరుగుతోందా?
- బీఆర్ఎస్‌కు పెరుగుతున్న సవాల్
- ఏక నాయకత్వంతో బలంగా కాంగ్రెస్
- 2028పై కాంగ్రెస్ ఫోకస్
- రేవంత్ వ్యూహంపై చర్చ
- కాంగ్రెస్‌కు కలిసొస్తున్న సమీకరణలు

**ముద్ర డెస్క్ :**
తెలంగాణ రాజకీయ చరిత్రలో 2023 అసెంబ్లీ ఎన్నికలు ఒక మలుపు. అప్పటి వరకు పలువురు విశ్లేషకులు, రాజకీయ వర్గాలు కాంగ్రెస్ పార్టీని పూర్తిగా పక్కన పెట్టేసినట్లు చూశారు. అయితే ఆ అంచనాలన్నీ తలకిందులైపోయాయి. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరో మూడు పర్యాయాలు అధికారం కొనసాగుతుందనే ధీమాతో ముందుకు సాగుతోంది. 2018 నుంచి 2023 మధ్య కాలంలో జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ పెరుగుతున్న బలం స్పష్టంగా కనిపించింది. కాంగ్రెస్ అక్కడక్కడా కనిపించకపోవడంతో, అసలు పోటీ బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే జరుగుతుందని చాలామంది భావించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా బీజేపీని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని రాజకీయ వ్యూహాలు రచించారు. ఓట్లు చీలిపోతే మూడోసారి అధికారం సాధ్యమవుతుందని గులాబీ పార్టీ నాయకులు అంచనా వేశారు. అయితే జరిగింది వేరే. బీఆర్ఎస్‌పై ఉన్న అసంతృప్తి ఓట్లు అన్నీ ఒకే చోటకు కేంద్రీకృతమయ్యాయి. ఆ ఫలితం కాంగ్రెస్‌కు దక్కింది. ఇక్కడ రేవంత్‌రెడ్డి పాత్ర కీలకమైంది. కేసీఆర్‌కు నిజమైన ప్రత్యామ్నాయం తానేనని స్పష్టంగా చాటుకున్నారు. పార్టీలోని అనేక అగ్ర నేతలను సమన్వయం చేసుకుని, ఏకగ్రీవ నాయకత్వం ఏర్పాటు చేయడంలో విజయం సాధించారు. ఫలితంగా ప్రజల్లో విశ్వాసం పెరిగి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. గడచిన 30 నెలలుగా తనదైన శైలిలో పాలిస్తున్నారు. మిగతా 02లో

# అమరావతి.. అదుర్స్!

## దేశంలోనే తొలి పోల్ ఫ్రీ రాజధాని



- వైర్లు, స్తంభాలు లేని సిటీ
- అండర్‌గ్రౌండ్ నెట్‌వర్క్, క్లీన్ అండ్ గ్రీన్ క్యాపిటల్
- అత్యాధునిక మౌలిక వసతులతో రాజధాని

02

# 20 లక్షల మార్క్ దాటిన ఇంటింటికీ తెలుగుదేశం

## ఒక్కరోజే 3 లక్షల ఇళ్లకు చేరిన శ్రేణులు

- రాష్ట్రవ్యాప్తంగా జోరుగా సాగుతున్న 'ఇంటింటికీ తెలుగుదేశం'
- క్షేత్రస్థాయిలో టీడీపీ బలోపేతానికి ఇంటింటి ప్రచారం



**ముద్ర, అమరావతి:**
తెలుగుదేశం పార్టీ రెండేళ్ల సుపరిపాలనపై ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం– 2026, 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి–సంక్షేమం" కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా దిగ్విజయంగా కొనసాగుతోంది. ఈ ఎనిమిది రోజుల పాటు టీడీపీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ఇంటింటి మిగతా 02లో

# సహజీవనంలోనూ గృహహింస

## లివ్-ఇన్ రిలేషన్ లో మహిళలకూ 498A రక్షణ

- వివాహ ఉద్దేశం నిరూపిస్తే గృహ హింస కేసు పెట్టొచ్చు
- క్రిమినల్ చర్యలకు గ్రీన్ సిగ్నల్
- లివ్-ఇన్ సంబంధాలకూ సమాన చట్టపరమైన రక్షణ
- సుప్రీంకోర్టు సంచలన తీర్పు



**ముద్ర డెస్క్ :**
దేశంలో సహజీవనం (లివ్–ఇన్ రిలేషన్‌షిప్)లో ఉన్న మహిళలకు సుప్రీంకోర్టు కీలక ఊరట కల్పించింది. వివాహాన్ని పోలిన సహజీవన బంధంలో ఉన్న మహిళలు కూడా భారతీయ శిక్షాస్మృతిలోని (IPC) సెక్షన్ 498A కింద గృహ హింస, వేధింపుల కేసులు నమోదు చేసుకునే హక్కు ఉందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే ప్రతి లివ్–ఇన్ సంబంధానికి ఈ రక్షణ వర్తించదని, తమ బంధం వివాహంతో సమానమైనదని, ఇద్దరికీ వివాహం చేసుకోవాలనే స్పష్టమైన ఉద్దేశం ఉన్నట్లు మహిళ నిరూపించాల్సి ఉంటుందని పేర్కొంది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. కర్ణాటకకు చెందిన ఓ కేసును విచారించిన ధర్మాసనం, చట్టబద్ధమైన వివాహంలో ఉన్న మహిళలకు మాత్రమే సెక్షన్ 498A పరిమితం కాదని, వివాహ స్వరూపాన్ని కలిగి ఉన్న సహజీవన బంధాల్లో ఉన్న మహిళలకు కూడా ఈ చట్టం కింద రక్షణ లభిస్తుందని తేల్చిచెప్పింది. కేసు వివరాల ప్రకారం.. డాక్టర్ లోకేష్ అనే వ్యక్తి తనకు ఇప్పటికే వివాహం జరిగిన విషయాన్ని దాచిపెట్టి రెండోసారి పెళ్లి చేసుకున్నాడని బాధితురాలు ఆరోపించింది. అనంతరం అదనపు కట్నం కోసం వేధించడంతో పాటు శారీరకంగా దాడి చేసి, నిప్పంటించి చంపేందుకు కూడా ప్రయత్నించారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ కేసును కొట్టివేయాలని నిందితుడు కోరినా, కర్ణాటక హైకోర్టు నిరాకరించింది. ఆ తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించినప్పటికీ, అత్యున్నత న్యాయస్థానం కూడా మిగతా 02లో

# రూ.52కే సన్నబియ్యం

## రాష్ట్రవ్యాప్తంగా సబ్సిడీ విక్రయాలకు శ్రీకారం

- 150 రైతు బజార్లు, 500 రైస్ మిల్లింగ్ అవుట్‌లెట్లలో నేటి నుంచే అందుబాటులోకి
- ప్రతి కుటుంబానికి 10 కిలోల వరకు అవకాశం
- ఆధార్‌తో విక్రయాల పర్యవేక్షణ

02



# పెట్టుబడులు పెట్టండి

## ఆటా సభల్లో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

- మాతృభూమి రుణం తీర్చుకోండి
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ప్రభుత్వ విధానాలు
- ప్రవాస భారతీయులకు ఉప ముఖ్యమంత్రి పిలుపు

03



# ట్రైనీ ఐపీఎస్ కేసులో మరో ట్విస్ట్

## ప్రేమలేఖలు, ల్యాప్‌టాప్ స్వాధీనం

- మరో మహిళతో వివాహేతర సంబంధం
- ఉదయ్ గదిలో కీలక ఆధారాలు
- సీన్ రీ-కన్‌స్ట్రక్షన్‌లో ఆధారాల స్వాధీనం
- 20 మంది వాంగ్మూలాలు నమోదు

03



## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 04.08.2026
www.mudranews.in | @mudranews



## భోజనం తర్వాత వెంటనే పడుకోవద్దు



తిన్న వెంటనే పడుకోవడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. కనీసం 20—30 నిమిషాలు నడవడం లేదా కూర్చోవడం వల్ల ఆహారం సులభంగా జీర్ణమవుతుంది.

# 'అమరావతి'.. అదుర్స్!



**ముద్ర డెస్క్:**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మరో ప్రత్యేకతను సొంతం చేసుకోనుంది. దేశంలోనే తొలి పూర్తి స్థాయి పోల్ ఫ్రీ సిటీగా అమరావతిని తీర్చిదిద్దుతున్నారు. నగరంలో విద్యుత్ స్తంభాలు, గజిబిజి వైర్లు కనిపించకుండా విద్యుత్, కమ్యూనికేషన్, ఇంటర్నెట్, తాగునీరు, డ్రైనేజీ వంటి అన్ని యుటిలిటీ సేవలను పూర్తిగా భూగర్భ నెట్‌వర్క్ ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నారు.
ప్రస్తుతం యుటిలిటీ డక్ట్స్, అండర్‌గ్రౌండ్ టన్నెల్ వ్యవస్థ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ విధానం వల్ల భవిష్యత్తులో మరమ్మత్తులు లేదా కొత్త కేబుళ్లు వేయాల్సి వచ్చినా రోడ్లను తవ్వాల్సిన అవసరం ఉండదు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం తగ్గడంతో పాటు నిర్వహణ కూడా సులభంగా ఉంటుంది. తుఫాన్లు, భారీ వర్షాలు, ఈదురుగాలుల వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో విద్యుత్, కమ్యూనికేషన్ సేవలకు అంతరాయం కలిగే అవకాశాలు గణనీయంగా తగ్గనున్నాయి. పర్యావరణ పరిరక్షణ, ప్రజల భద్రత, ఆధునిక మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తూ అమరావతిని క్లీన్ అండ్ గ్రీన్ స్మార్ట్ క్యాపిటల్‌గా అభివృద్ధి చేస్తున్నారు. ప్రభుత్వం 2028 నాటికి తొలి దశ రాజధాని నిర్మాణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆధునిక నగర నిర్మాణంలో అమరావతి దేశానికే ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంది.

# కుంభవృష్టి..



**ముద్ర, సికింద్రాబాద్ :**
సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో జరిగిన లష్కర్ బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వేడుకల్లో ప్రధాన ఘట్టమైన రంగం కార్యక్రమం సోమవారం(ఆగస్టు 3న)వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మాతంగి స్వర్ణలత ద్వారా వెలువడిన భవిష్యవాణి అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రకృతి వైపరీత్యాలు, సామాజిక ప్రవర్తన, ఆలయ సంబంధిత కోరికలపై ఆమె స్పష్టమైన సందేశాలు అందించారు.

**భారీ వర్షాలు, ప్రమాదాలపై హెచ్చరిక..**

ఈ సంవత్సరం కుంభవృష్టి స్థాయి వర్షాలు కురుస్తాయని మాతంగి స్వర్ణలత తెలిపారు. దీనివల్ల ప్రజలు ప్రవాహాల్లో కొట్టుకుపోయే ప్రమాదం ఉందని, ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. అదనంగా అగ్ని ప్రమాదాలు కూడా జరుగుతాయని పేర్కొన్నారు. సమాజంలో మర్యాదలు మరచిపోయి అనుచిత ప్రవర్తనలు పెరుగుతాయని కూడా భవిష్యవాణిలో ఆందోళన వ్యక్తం చేశారు. బాలలను కాపాడుతానని అభయం ఇస్తూనే, ప్రస్తుతం ప్రజల్లో నిరుత్సాహం, మనసు తృప్తి లేకపోవడం కనిపిస్తోందన్నారు.

**విగ్రహ ప్రతిష్ఠపై ఆగ్రహం..**

ఇక తన విగ్రహ ప్రతిష్ఠ చేస్తామని మాట ఇచ్చినా ఇంతవరకు అమలు కాకపోవడంపై మాతంగి స్వర్ణలత అసంతృప్తి వ్యక్తం చేశారు. అందరినీ రక్షిస్తున్నా, తన కోరికను నెరవేర్చకపోవడం ఆగ్రహాన్ని కలిగిస్తుందని చెప్పారు. ఎవరు అడ్డుపడినా విగ్రహం ఏర్పాటు చేయించుకుంటానని స్పష్టం చేశారు. ఆరు నెలల్లోగా ఇది జరగకపోతే భారీగా ప్రాణనష్టం కలిగిస్తానని, అడ్డొచ్చిన వారిని కాలికింద నలిపేస్తానని హెచ్చరించారు. తాను పెద్ద మొత్తంలో అనుగ్రహం అందిస్తున్నా, ప్రతిఫలంగా కనీస స్థాయి సహకారం కూడా లభించడం లేదని అన్నారు.

**స్పందించిన మంత్రి..**

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ మాతంగి భవిష్యవాణిని ప్రస్తావిస్తూ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉంటాయని అన్నారు. బోనాల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని, అధిక జనసమూహంతో కాస్త ఒత్తిడి ఏర్పడిందని చెప్పారు. జోగినీలు ప్రత్యేక గుర్తింపు కోరిన నేపథ్యంలో వారికి ఐడీ కార్డులు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో కో–ఆప్షన్ ద్వారా వారిని చేర్చుకునే నిర్ణయం ఉందని, లాల్ దర్వాజా బోనాలకు సంబంధించి మూడు శాఖల సమన్వయంతో సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

**ఉత్సవ విజయం**

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ బోనాలను దేశవ్యాప్తంగా అనేకమంది వీక్షించారని తెలిపారు. ఉదయం నుంచే వేలాది మంది మహిళలు బోనాలు సమర్పించారని, రంగం కార్యక్రమం విజయవంతమైందని అన్నారు. అంబారీ ఊరేగింపు కొనసాగుతోందని వివరించారు. ఉజ్జయిని మహంకాళి ఆలయం రెండు వందల ఏళ్ల చరిత్ర కలిగి ఉందని, అప్పటి నుంచి బోనాల పండుగ కొనసాగుతోందని గుర్తు చేశారు. రంగం కార్యక్రమం కేవలం మతపరమైన ఘట్టం మాత్రమే కాకుండా, ప్రకృతి హెచ్చరికలు, సామాజిక అవసరాలు, ఆలయ అభివృద్ధి అంశాలను ముందుకు తెచ్చింది. మాతంగి స్వర్ణలత వెలిబుచ్చిన మాటలు ప్రజల్లో జాగ్రత్తతోపాటు అధికార యంత్రాంగం బాధ్యతలపైనా చర్చను రేకెత్తించాయి.

# జాబ్ క్యాలెండర్ ఎక్కడ?

(మొదటి పేజీ తరువాయి)
చేశాడు. కాంగ్రెస్ హామీ ఏమైందని యువకుడు ప్రశ్నించాడు. పిల్లలు ఇక్కడ ఆత్మహత్యలకు పాల్పడుతుంటే రాహుల్ గాంధీ ఎక్కడ ఉన్నాడు? ఇంజినీర్లు క్రిమినల్ వేస్టు అని రేవంత్ చిల్లర మాటలు మాట్లాడుతున్నాడు. రెండేళ్లలో 10 వేల ఉద్యోగాలు కూడా దాటలేదు. మీ చేతగాని అసమర్థ పాలనకు ఒక ఛార్జిషీట్ ఈ సూసైడ్ నోట్. ఆ పిల్లాడి సూసైడ్ నోట్ చూస్తే బాధ కలిగింది. నిరుద్యోగులు దయ చేసి బలవన్మరణాలకు పాల్పడవద్దు. మా ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాలు భర్తీ చేస్తాం. దయచేసి తనువులు చాలించకండి." అని సూచించారు.

**రాహుల్ గాంధీ ఫోజులు**

జెన్‌జీ ఉద్యమంలో పాల్గొన్నట్టు , విద్యార్థులకు అండగా ఉంటున్నట్టు రాహుల్ గాంధీ ఫోజులు కొడుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇక్కడ మాత్రం ఆ పార్టీ సీఎం విద్యార్థులను క్రిమినల్స్‌తో పోలుస్తున్నారని దీనికి రాహుల్ చెప్పే సమాధానం ఏంటని నిలదీశారు. "విద్యార్థుల ఆందోళనకు మద్దతు పలికినట్టుగా రాహుల్ పోజులు. మీ ముఖ్యమంత్రి ఇంజనీర్లను క్రిమినల్ వేస్ట్ అన్నాడు. రేవంత్ వ్యాఖ్యలపై రాహుల్ ఉలకడు పలకడు. రాహుల్‌కు, రేవంత్‌కు విద్యార్థుల ముందకొచ్చి మాట్లాడే దమ్ములేదు. ఇతర రాష్ట్రాల్లో లాఠీఛార్జీలు జరిగితే రాహుల్ పరిగెత్తుకొని పోతాడు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో లాఠీఛార్జీలు జరిగితే మాత్రం రాడు. ఇంజనీర్లను క్రిమినల్ వేస్ట్ అంటే అందరం బాధపడ్డం. విదేశాల్లో పనిచేస్తున్న మన ఇంజనీర్లు క్రిమినల్ వేస్టా? రాహుల్ గాంధీ, రేవంత్ కలిసి ప్రకటించిన డిక్లరేషన్లు క్రిమినల్ వేస్ట్. వందల టీఎంసీల నీళ్లను సముద్రంలోకి వదలడం క్రిమినల్ వేస్ట్. రూ.200 కోట్లతో అందాల పోటీలు పెట్టడం క్రిమినల్ వేస్ట్. మెస్సీతో ఫుట్ బాల్ ఆటకు రూ.100 కోట్లు తగలేయడం క్రిమినల్ వేస్ట్. తెలంగాణకు రేవంత్ అనే సన్నాసిని సీఎంగా పెట్టడమే క్రిమినల్ వేస్ట్. రేవంత్ ఏం చదివిండో డౌటే. నకల్ కొట్టి పాసైన బాపతే అయ్యింటుంది." అని ఎద్దేవా చేశారు.

# రూ.52కే సన్నబియ్యం

**ముద్ర, అమరావతి:**
రాష్ట్రంలో పెరుగుతున్న నిత్యావసర ధరలతో ప్రజలపై పడుతున్న భారాన్ని తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నాణ్యమైన సన్నబియ్యాన్ని మార్కెట్ ధర కంటే తక్కువకు అందించే సబ్సిడీ బియ్యం విక్రయాలను ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ప్రారంభించారు. విజయవాడ ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ రైతు బజార్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, రాష్ట్రవ్యాప్తంగా 150 రైతు బజార్లు, 500 రైస్ మిల్లింగ్ అవుట్‌లెట్లలో నేటి నుంచే విక్రయాలు అందుబాటులోకి వచ్చాయని ప్రకటించారు.
బహిరంగ మార్కెట్‌లో రూ.64–65 పలుకుతున్న బీపీటీ స్టీమ్ రైస్‌ను కిలో రూ.52కే, రూ.58–60 ధర ఉన్న బీపీటీ బియ్యాన్ని రూ.50కే విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి గరిష్టంగా 10 కిలోల వరకు సబ్సిడీ ధరకు బియ్యం కొనుగోలు చేసే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు.
బియ్యం పక్కదారి పట్టకుండా ఆధార్ లేదా బయోమెట్రిక్ నమోదు ద్వారా విక్రయాలను పర్యవేక్షిస్తామని, జిల్లాల వారీగా నిల్వలు, విక్రయాలు, వినియోగదారుల వివరాలను ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. ఈ పథకం కోసం రైస్ మిల్లర్లు తమ నిల్వల్లో 10 శాతం బియ్యాన్ని కేటాయించేందుకు ముందుకు వచ్చారని చెప్పారు.
దేశంలోనే అత్యంత తక్కువ ధరకు అత్యుత్తమ నాణ్యత కలిగిన బియ్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న మంత్రి, బియ్యంతో పాటు కందిపప్పు, పామాయిల్ వంటి నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ఈ పథకం ప్రయోజనాలను ప్రజలకు విస్తృతంగా చేర్చేందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.



# కాంగ్రెస్ హ్యాట్రిక్ వ్యూహం



(మొదటి పేజీ తరువాయి)
రేవంత్ రెడ్డి ప్రతి సభలోనూ, పార్టీ సమావేశాల్లోనూ కాంగ్రెస్ మరో మూడు పర్యాయాలు గెలుస్తుందని స్పష్టంగా చెబుతున్నారు. ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో కూడా 2034 వరకు తానే ఉంటానని, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇది కేవలం కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచే ప్రయత్నం మాత్రమే కాదు. దీని వెనుక దీర్ఘకాలిక రాజకీయ వ్యూహం కనిపిస్తోంది. కాంగ్రెస్‌లో సాధారణంగా వర్గపోరులు పార్టీని బలహీనపరుస్తాయి. అయితే ఏక నాయకత్వం ఉన్నప్పుడు ఆ పార్టీ అద్భుతాలు సృష్టించగలదని గత చరిత్ర చెబుతోంది. ప్రస్తుతం రేవంత్ ఆ లోటును తీరుస్తున్నారని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ బలం మరింతగా పెరుగుతోంది.

**జాతీయ స్థాయిలో అనుకూలం**
దేశవ్యాప్తంగా బీజేపీపై అసంతృప్తి మెల్లగా పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఇది కాంగ్రెస్‌కు అనుకూల పరిస్థితిని సృష్టిస్తోంది. ఇండియా కూటమిలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్, 2029లో కేంద్రంలో అధికారం సాధించగలమని నమ్మకంతో ఉంది. దక్షిణ భారతదేశంలోనే కాంగ్రెస్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణ, కర్ణాటక, కేరళల్లో అధికారంలో ఉండటం, తమిళనాడులో భాగస్వామ్యం ఇలాంటి అంశాలు ఆ పార్టీకి బలం చేకూరుస్తున్నాయి. యువతలో కూడా కేంద్ర ప్రభుత్వంపై అసంతృప్తి ఉందని, వారు జాతీయ స్థాయిలో బలమైన ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను ఎంచుకోవచ్చని రేవంత్ అంచనా వేస్తున్నారు. ఈ జాతీయ పరిణామాలు తెలంగాణలోని స్థానిక రాజకీయాలపై కూడా ప్రభావం చూపుతాయి. 2028 ఎన్నికల నాటికి ఈ పరిస్థితులు మరింత బలపడితే, కాంగ్రెస్‌కు మరోసారి విజయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయం.

**బీఆర్ఎస్ భవిష్యత్ సవాల్..**

కాంగ్రెస్ బలం పెరుగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. గతంలో బలమైన ప్రాంతీయ పార్టీగా నిలిచిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి తన స్థానాన్ని కాపాడుకోవాల్సిన సవాలు ఎదుర్కొంటోంది. కాంగ్రెస్‌లో ఏక నాయకత్వం కొనసాగితే, ప్రాంతీయ పార్టీలకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పునరాగమనం కేవలం ఒక ఎన్నికల ఫలితం మాత్రమే కాదు. బలమైన నాయకత్వం, జాతీయ పరిస్థితులు, యువత ఆకాంక్షలు కలిసి ఒక కొత్త రాజకీయ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. రేవంత్ రెడ్డి చెబుతున్న మూడు టర్ముల లక్ష్యం నిజమవుతుందా లేదా అనేది కాలం నిర్ణయిస్తుంది. అయితే ప్రస్తుత పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగానే కనిపిస్తున్నాయి.

# బీజేపీకి షాక్

**ముద్ర డెస్క్:**
కొద్దిరోజులుగా మనదేశంలో జనరేషన్ జెడ్ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తోంది. నీట్ పేపర్ లీకేజీ తర్వాత జనరేషన్ జెడ్ తరంలో ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. అందువల్లే జంతర్ మంతర్ వేదికగా రోజులపాటు కేంద్రానికి వ్యతిరేకంగా యువకులు ఉద్యమాలు చేశారు.
కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాత కూడా యువకులు శాంతించడం లేదు. ఇప్పుడు అదే ఆగ్రహాన్ని బీజేపీ మీద మరో రూపంలో చూపించారు జనరేషన్ జెడ్ యువకులు. బిజెపి ఊహించిన విధమైన ఫలితాన్ని ఇచ్చి చుక్కలు చూపించారు. వాస్తవానికి ఇలా జరుగుతుందని ఎవరూ ఊహించలేదు.
బీహార్ రాష్ట్రంలో బంకిపూర్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు జరిగాయి. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాజ్యసభకు వెళ్లిన నేపథ్యంలో.. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న బంకిపూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో ఈ ప్రాంతంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇక్కడ గెలవడానికి బిజెపి.. ఆర్జెడి.. జన్ సూరజ్ పార్టీలు తీవ్రంగా పోరాటం చేశాయి. జన్ సూరజ్ పార్టీ నుంచి ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ పోటీలో ఉన్నారు. పైగా ఈ నియోజకవర్గంలో 1995 నుంచి బిజెపి ఒక్కసారి కూడా ఓడిపోలేదు.
ఉప ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని నితిన్ నబీన్.. కేంద్ర మంత్రులు.. బిజెపి ఎమ్మెల్యేలు బిజెపి అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం చేశారు. ఆర్జెడి తరఫున కూడా భారీగానే ప్రచారం జరిగింది. కానీ జన్ సూరజ్ పార్టీ నుంచి ప్రశాంత్ కిషోర్ మాత్రమే ప్రచారం చేశారు. బిజెపి.. ఆర్జెడి మధ్య ఓట్ల చీలిక రావడంతో.. అది ప్రశాంత్ కిషోర్ కు అనుకూలంగా మారింది. దీంతో ఈ నియోజకవర్గంలో ఆయన తన సమీప బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హా పై ప్రశాంత్ కిషోర్ 15 వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇటీవల కాలంలో జనరేషన్ జెడ్ తరం బిజెపికి వ్యతిరేకంగా ఉంది. ముఖ్యంగా నీట్ పేపర్ లీకేజీ జరిగిన నాటి నుంచి జనరేషన్ జెడ్ తరం కేంద్ర ప్రభుత్వం మీద ఒక రకంగా యుద్ధాన్ని ప్రకటించింది. బంకిపూర్ నియోజకవర్గంలో కూడా జనరేషన్ జెడ్ తరం బిజెపికి ఓట్లు వేయలేదు. జన్ సూరజ్ అధినేత ప్రశాంత్ కిషోర్ కు జై కొట్టింది. ఎన్నికల ప్రచారంలో కూడా ప్రశాంత్ కిషోర్ అద్భుతమైన వ్యూహాన్ని అనుసరించారు. యువకులను ఆకట్టుకునే విధంగా ప్రసంగాలు చేశారు. అందువల్లే ఉప ఎన్నికల్లో ఆయన గెలవగలిగారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీహార్ రాష్ట్రంలో జన్ సూరజ్ పార్టీ ఖాతా తెరవలేదు. తాజా ఉప ఎన్నికలో గెలిచి జన్ సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ మొత్తానికి అసెంబ్లీలోకి అడుగుపెట్టబోతున్నారు.

## 20 లక్షల మార్క్ దాటిన
# ఇంటింటికీ టీడీపీ



(మొదటి పేజీ తరువాయి)
వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరిస్తూ సరికొత్త మైలురాయిని అధిగమించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా, నేడు ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షలకు పైగా ఇళ్లను టీడీపీ శ్రేణులు సందర్శించాయి. దీంతో ఈ కార్యక్ర మం ద్వారా ఇప్పటివరకు మొత్తం 20.61 లక్షల ఇళ్ల మార్క్‌ను విజయవంతంగా దాటింది. సోమవారం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అత్యంత ఉత్సాహంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా భారీ సంఖ్యలో ఇళ్లను టీడీపీ శ్రేణులు సందర్శించి, ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాయి. అన్ని జిల్లాల్లో ప్రజల నుంచి లభిస్తున్న అపూర్వ ఆదరణ ఈ కార్యక్రమంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ నారా లోకేష్ గారు అన్నారు. 20 లక్షల మార్క్ దాటడంపై ఆయన కార్యకర్తలు, శ్రేణులను అభినందించారు.

# సహజీవనంలోనూ గృహహింస కేసు

(మొదటి పేజీ తరువాయి)
హైకోర్టు నిర్ణయాన్నే సమర్థించింది. తీర్పులో భాగంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గృహ హింస నుంచి మహిళలకు రక్షణ కల్పించడమే సెక్షన్ 498A ప్రధాన ఉద్దేశమని, కేవలం చట్టబద్ధమైన వివాహం జరగలేదనే కారణంతో వేధింపులను నేరంగా పరిగణించకపోవడం చట్టం లక్ష్యానికి విరుద్ధమని స్పష్టం చేసింది. వివాహ బంధంతో సమానమైన పరిస్థితుల్లో కలిసి జీవిస్తూ, భవిష్యత్తులో పెళ్లి చేసుకోవాలనే స్పష్టమైన ఉద్దేశంతో ఉన్న జంటల విషయంలో ఈ చట్టం వర్తిస్తుందని పేర్కొంది.



అలాగే, చట్టబద్ధమైన వివాహంలో ఉన్న మహిళలకు, వివాహ స్వరూపం కలిగిన లివ్–ఇన్ సంబంధంలో ఉన్న మహిళలకు రక్షణ విషయంలో తేడా చూపడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 కల్పించిన సమానత్వ హక్కుకు విరుద్ధమని ధర్మాసనం అభిప్రాయపడింది. మహిళలపై జరిగే మానసిక, శారీరక వేధింపులు వివాహం అయినా, సహజీవనం అయినా ఒకే విధంగా తీవ్రమైనవేనని కోర్టు వ్యాఖ్యానించింది.



గృహహింస నిరోధక చట్టం ఇప్పటికే లివ్–ఇన్ సంబంధాల్లో ఉన్న మహిళలకు రక్షణ కల్పిస్తున్నందున, సెక్షన్ 498A అవసరం లేదన్న వాదనను కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. గృహ హింస నిరోధక చట్టం, సెక్షన్ 498A లక్ష్యాలు వేర్వేరని, క్రూరత్వానికి పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు సెక్షన్ 498A కీలక చట్టపరమైన ఆయుధమని పేర్కొంది.
అయితే ఈ తీర్పు ప్రతి సహజీవన బంధానికి వర్తించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వివాహం చేసుకోవాలనే పరస్పర ఉద్దేశం, భార్యాభర్తల మాదిరిగా కలిసి జీవించిన పరిస్థితులు వంటి అంశాలను నిరూపించిన సందర్భాల్లో మాత్రమే సెక్షన్ 498A కింద రక్షణ లభిస్తుందని తేల్చిచెప్పింది. ఈ తీర్పు సహజీవనంలో ఉన్న మహిళల హక్కుల పరిరక్షణకు కీలక మైలురాయిగా భావిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 04.08.2026
www.mudranews.in | @mudranews



**తిన్నది ఒంటబట్టడానికి తగినంత నీరు తాగండి**

రోజంతా సరిపడా నీరు తాగడం వల్ల జీర్ణవ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. అయితే భోజనం సమయంలో అధికంగా నీరు తాగకుండా ఉండటం మంచిది.



# పెట్టుబడులు పెట్టండి

**మాతృభూమి రుణం తీర్చుకోండి**
**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం**
**పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ప్రభుత్వ విధానాలు..**
**అమెరికాలో ప్రవాస భారతీయులకు ఉప ముఖ్యమంత్రి పిలుపు**
**ఆటా సభల్లో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క**

**ముద్ర హైదరాబాద్ :** అమెరికాలోని బాల్టిమోర్‌లో 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) మహాసభలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ప్రపంచ నలుమూలల నుండి విచ్చేసిన తెలుగు వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయన నమస్కారాలు తెలియజేశారు. ఆటా నిర్వాహకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని, సహచర మంత్రులను ఈ మహాసభలకు ఆహ్వానించినప్పుడు ఇచ్చిన మాటకు కట్టుబడి తాము ఇక్కడికి వచ్చామని ఆయన తెలిపారు. వేల కిలోమీటర్లు దాటి విదేశాలకు వెళ్లినప్పటికీ, మన మూలాలను మర్చిపోకుండా, తాము సాధించిన ప్రగతిని , నైపుణ్యాన్ని సమాజంతో పంచుకోవాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసుకున్న ఈ కార్యక్రమం విజయవంతం కావడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని వనరులన్నింటినీ సమన్వయం చేస్తూ ముందుకు వెళ్తోందని భట్టి విక్రమార్క వెల్లడించారు. తెలంగాణను కేవలం భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా, ప్రపంచంలోని అత్యున్నతంగా అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నగరంలోని మూసీ నదిని సుమారు 56 కిలోమీటర్ల పొడవునా ప్రక్షాళన చేసి, రివర్ ఫ్రంట్‌గా అభివృద్ధి చేసే బృహత్ ప్రాజెక్ట్‌ను చేపట్టినట్లు తెలిపారు. అలాగే ఔటర్ రింగ్ రోడ్‌ను అనుసంధానిస్తూ రీజినల్ రింగ్ రోడ్ (ట్రిపుల్ ఆర్), 36 రేడియల్ రోడ్లను ప్లాన్ చేశామని, హైదరాబాద్ ను ఆనుకుని ఒక సరికొత్త 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మించ బోతున్నామని వివరించారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మానవ వనరులను మెరుగుపరచడం ఎంతో ముఖ్యమని, అందుకోసం విద్యా రంగానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 100 శాసనసభ నియోజకవర్గాలలో ఒక్కో పాఠశాలను రూ. 200 కోట్ల వ్యయంతో 25 ఎకరాల క్యాంపస్‌లో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' పేరుతో నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న పేద పిల్లలే నేడు అమెరికా దాకా వచ్చి ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగారని కొనియాడారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల రంగాలలో విప్లవాత్మక మార్పులు తెస్తూ, ఇటీవల గ్లోబల్ సమ్మిట్‌ను కూడా నిర్వహించామని గుర్తుచేశారు.



అమెరికాలో స్థిరపడిన పారిశ్రామికవేత్తలు , ఎన్నారైలు తెలంగాణకు వచ్చి పరిశ్రమలను స్థాపించాలని, మేధస్సును రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగించాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. పెట్టుబడులు పెట్టడానికి వచ్చే ఎవరికైనా సింగిల్ విండో విధానం ద్వారా అన్ని అనుమతులు సులభంగా లభించేలా ప్రభుత్వపరంగా అన్ని వ్యవస్థలను సిద్ధం చేశామని తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఈ ప్రయాణంలో ఎన్నారైలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఎన్నారైల సమస్యలను పరిష్కరించడానికి చట్టపరమైన రక్షణతో కూడిన ఒక ప్రత్యేక వ్యవస్థను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా, ఓటర్ల నమోదు కోసం ప్రభుత్వం కల్పించిన ఆన్‌లైన్ వెబ్‌సైట్ సదుపాయాన్ని ఉపయోగించుకుని ప్రతి ఒక్కరూ తమ ఓట్లను నమోదు చేసుకోవాలని కోరుతూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

## సాగునీటి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులపై ఫోకస్

**- ఆరు నెలల్లో పూర్తి లక్ష్యం : మంత్రి ఉత్తమ్**



**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో ఏర్పడిన న్యాయపరమైన స్పష్టతను రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలంగా వినియోగించుకోవాలని అధికారులకు ఆదేశించారు. పాలమూరు–రంగారెడ్డి, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్యంతో తీసుకుని, సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తొలి 60 రోజుల్లో అవసరమైన దరఖాస్తులు, సాంకేతిక పత్రాలు, పరిపాలనా ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు.

గౌరవెల్లి పంప్ హౌస్ ను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని, అనుమతులు లభించిన వెంటనే సీతారామ సాగర్ పనులను పునఃప్రారంభించేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అలాగే పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంపై శాస్త్రీయ అధ్యయనాలను వేగవంతం చేసి, తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ కోసం అంతర్రాష్ట్ర విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని మంత్రి సూచించారు.

ఈ సమావేశంలో ఇంజినీర్ –ఇన్–చీఫ్ (జనరల్ ) ఓ.వీ. రమేష్ బాబు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ , ఇంజినీర్ –ఇన్ –చీఫ్ (అడ్మిన్ ) పి.శ్రీనివాస్ , ఇంజినీర్–ఇన్–చీఫ్ (ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ ) ఆర్. మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజుల 'సేఫ్ స్పోర్ట్స్ తెలంగాణ' వర్క్‌షాప్

**ముద్ర, హైదరాబాద్,** : తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన 'సేఫ్ స్పోర్ట్స్ తెలంగాణ' వర్క్ షాప్ సోమవారం గచ్చిబౌలి స్టేడియంలో ముగిసింది. తెలంగాణ క్రీడా విధానం–2025లో భాగంగా రాష్ట్రంలో క్రీడలకు సురక్షిత, సమానత్వంతో కూడిన వాతావరణాన్ని కల్పించేందుకు సమగ్ర సేఫ్ స్పోర్ట్స్ విధానాన్ని అమలు చేయాలనే లక్ష్యంతో ఈ వర్క్ షాప్ ను నిర్వహించినట్లు క్రీడా ప్రాధికార సంస్థ తెలిపింది. మొదటి రోజు హకీమ్ పేట్ స్పోర్ట్స్ స్కూల్ లో విద్యార్థినులు,విద్యార్థులకు, రెండో రోజు క్రీడా నిర్వాహకులు (స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్లు), కోచ్ లకు, మూడో రోజు నగరంలోని పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులకు శిక్షణకార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీమతి అనిత, యునెస్కో ప్రతినిధి డాక్టర్ చెరుకూరి, యుగాంతర్ ఎన్ జీఓ ప్రతినిధి మాడభూషి తేజస్విని స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు స్పోర్ట్స్ అథారిటీ పి ఆర్ ఓ కాలేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు

## మీ సేవ కేంద్రాల బలోపేతానికి కార్యాచరణ..

**- టి-ఫైబర్ పనులు వేగవంతం చేయాలి: సీఎస్ సంజయ్ జాజు**

**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రంలోని మీ సేవ కేంద్రాలను మరింత పటిష్టపరిచి ప్రజలకు నాణ్యమైన డిజిటల్ సేవలు అందించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ప్రపంచ బ్యాంక్ డిజిటల్–ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్ చందానీ బృందంతో జరిగిన సమావేశంలో డిజిటల్ గవర్నెన్స్, కృత్రిమ మేధస్సు , సైబర్ భద్రత, డిజిటల్ పబ్లిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ , కొత్త డేటా సెంటర్ల ఏర్పాటు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో డిజిటల్ రంగ అభివృద్ధికి ప్రపంచ బ్యాంక్ సాంకేతిక సహకారం అందించేందుకు ఆసక్తి వ్యక్తం చేసింది. అనంతరం టి–ఫైబర్ ప్రాజెక్టు పురోగతిని సమీక్షించిన సంజయ్ జాజు, గ్రామీణ–పట్టణ ప్రాంతాల్లో బ్రాడ్ బ్యాండ్ సేవల విస్తరణ కోసం పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దూరిశెట్టి, ప్రపంచ బ్యాంక్ డిజిటల్–ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్ చందానీ, టి–ఫైబర్ ఎం.డి., సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మరింత పటిష్టంగా అభివృద్ధి పథకాల అమలు

**- సిఎస్ సంజయ్ జాజు**

**ముద్ర, హైదరాబాద్** : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే పలు అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు మరింత పటిష్టంగా అమలయ్యేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయము అవసరమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, మహేష్ దత్ ఎక్కా, సవ్య సాచి ఘోష్, వాణి ప్రసాద్, దాన కిషోర్, నవీన్ మిట్టల్,ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, క్రిస్టినా చొంగ్తూ, రఘునందన్ రావ్, కార్యదర్శులు గౌరవ్ ఉప్పల్, హరిచందన, బాల మాయాదేవి, సురేంద్ర మోహన్, ఇలంబర్తి తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి గారి దార్శనికతతో రాష్ట్రంలో పురోగతిలో ఉన్నఅనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలయ్యేందుకు వివిధ శాఖల మధ్య అంతర్గత సమన్వయము అవసరమని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల పురోగతి, లక్ష్యాలు, అమలు తదితర వివరాలను సవివరంగా తెలిపే డాష్‌బోర్డు ను ఏర్పాటు చేస్తున్నామని, అదేవిధంగా ఈ పథకాలు, కార్యక్రమాలు లక్ష్యాల మేరకు అమలవడానికి స్పీడ్ సెల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. మరో వారం రోజుల్లో ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ పథకాలు, కార్యక్రమాలు, ప్రభుత్వ శాఖల పనితీరు, లక్ష్యాలు, పురోగతి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, కేంద్రప్రాయోజిత పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ కార్యదర్శులతో త్వరలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని, ఇందుకు సన్నద్ధం కావాలని కార్యదర్శులకు సూచించారు. ప్రతీ శాఖలో అమలవుతున్న వినూత్న పథకాలు/ విజయ గాధాలపై నివేదిక రూపొందించాలని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలతో సహా అన్నింటికీ టి– ఫైబర్ కనెక్టివిటీ ని తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన విజన్ డాక్యుమెంట్–2047 లో సూచించిన నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికా బద్దంగా పని చేయాలన్నారు.

## హైడ్రాపై ఈటల విమర్శలు

**పేదల ఇళ్ల కూల్చివేతకు ప్రభుత్వం బాధ్యత వహించాలి**



**ముద్ర, హైదరాబాద్ :** హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ప్రభుత్వానికి విచక్షణాధికారాలు ఉన్నా ఇళ్లు కూల్చే అధికారం లేదన్నారు. హైడ్రా చర్యల వల్ల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని, 95 శాతం మంది హైడ్రా పేరే వినగానే భయపడుతున్నారని పేర్కొన్నారు. హైడ్రా నిర్ణయాల వెనుక ప్రభుత్వ బాధ్యత ఉందని, తప్పు అధికారులది కాదని సీఎం రేవంత్ రెడ్డిదేనని ఆరోపించారు. అలాగే నల్లచెరువు, జొన్నలబండ ప్రాంతాల్లో బాధితుల పరిస్థితి బాధాకరమని అన్నారు.

# ట్రైనీ ఐపీఎస్ కేసులో మరో ట్విస్ట్..

**ప్రేమలేఖలు, ల్యాప్‌టాప్ స్వాధీనం**
**మరో మహిళతో సంబంధం.. దర్యాప్తులో కొత్త విషయాలు.**
**ఉదయ్ గదిలో కీలక ఆధారాలు..**
**సీన్ రీ-కన్‌స్ట్రక్షన్‌లో ఆధారాల స్వాధీనం**
**20 మంది వాంగ్మూలాలు నమోదు..**

**ముద్ర, హైదరాబాద్ :** ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారిణి ఫిర్యాదుతో నమోదైన కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో పోలీసులు సీన్ రీ–కన్‌స్ట్రక్షన్ నిర్వహించి పలు కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో మరో మహిళతో కూడా అతనికి సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఈ కేసు మరింత సంచలనంగా మారింది.అశోక్ నగర్‌లోని ఉదయ్ కృష్ణారెడ్డి నివాసంలో పోలీసులు సీన్ రీ–కన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గదిలో నుంచి రెండు ప్రేమలేఖలు, ఒక ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వస్తువులను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించి, కేసు దర్యాప్తులో భాగంగా విశ్లేషించనున్నారు.

ఈ విచారణలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ వివాహిత మహిళతో కూడా ఉదయ్ కృష్ణారెడ్డికి సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. భర్తతో విడిపోయిన అనంతరం హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న ఆ మహిళతో అతడు సన్నిహితంగా మెలిగినట్లు సమాచారం. అయితే విడాకుల తర్వాత



తనతో లివ్–ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండాలని ఉదయ్ చేసిన ప్రతిపాదనను ఆమె తిరస్కరించినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది.

ఈ ఏడాది ఫిబ్రవరిలో ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారిణి, మరో మహిళ కలిసినట్లు విచారణలో వెల్లడైంది. ఆ సమయంలో ఉదయ్ కృష్ణారెడ్డి ప్రవర్తనపై ఇద్దరూ ఒకరితో ఒకరు తమ అనుభవాలు, బాధలను పంచుకున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారిణి గదిలోకి బలవంతంగా ప్రవేశించి ఆమె మొబైల్ ఫోన్‌ను లాక్కున్నాడనే ఆరోపణలకు సంబంధించి పోలీసులు ఆధారాలను సేకరిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటివరకు సుమారు 20 మంది వాంగ్మూలాలను నమోదు చేశారు.

# అధికారులపై మంత్రి శ్రీధర్‌బాబు ఫైర్

**ముద్ర న్యూస్, మంథని :** పెద్దపల్లి జిల్లా మంథనిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను తెలంగాణ ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న ఆర్డీవో, ఎమ్మార్వో, 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్లను ఆరా తీశారు. ఆశించిన వేగంతో పనులు సాగకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులోకి రావాల్సిన ప్రభుత్వ భవనాల నిర్మాణాలను ఇకపై ఆలస్యం చేయవద్దని హెచ్చరించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. మంథని పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు.

**మంథనిలో బొక్కలవాగు ఆధునికీకరణ పనులు ప్రారంభం**

పెద్దపల్లి జిల్లా మంథని పట్టణ అభివృద్ధిలో భాగంగా బొక్కల వాగు ఆధునికీకరణ పనులకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శ్రీకారం చుట్టారు. కోకా–కోలా కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.2 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..పట్టణ ప్రజలకు



ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు, చిన్నారులు, వృద్ధులు మానసిక ఉల్లాసంతో గడిపేలా బొక్కల వాగు పరిసరాలను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. మంథని పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు నిధులు మంజూరు చేశామని, మరిన్ని నిధులు వెచ్చించి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు.

## జూరాల ప్రాజెక్ట్‌కు పెరుగుతున్న వరద

**ముద్ర న్యూస్, మహబూబ్ నగర్ :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరుగుతోంది. ప్రాజెక్టుకు ప్రస్తుతం 1,79,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, 27 గేట్లను ఎత్తి 1,77,105 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుతం 317.75 మీటర్ల నీటిమట్టం నమోదైంది. మరోవైపు, ప్రాజెక్టులోని 11 విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల ద్వారా 434 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు ప్రాజెక్టు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఎస్ఐఆర్‌లో లోపాలు సరిచేసి ఖచ్చితమైన సమాచారం నమోదు చేయాలి

**సీఈఓ సుదర్శన్ రెడ్డి**

**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక సవరణ కార్యక్రమం (SIR)లో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ నాణ్యతను మెరుగుపర్చేందుకు ఫొటోలు లేకపోవడం, జన్మతేదీ వ్యత్యాసాలు, లింగ వివరాల్లో పొరపాట్లు, సంతకాల లోపాలను వెంటనే సరిచేసి ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ పురోగతి, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, డిజిటైజేషన్ పనులను సమీక్షించారు. గైర్హాజరైన (Absent), నివాసం మార్చుకున్న (Shifted), మరణించిన (Dead), నకిలీ (Duplicate) ఓటర్ల (ASDD) కేసులు, No Mapping అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే బూత్ లెవల్ అధికారులు (BLOలు), సూపర్వైజర్లు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు (AEROలు) క్షేత్రస్థాయి ధృవీకరణను మరింత పటిష్టం చేయాలని, అవసరమైతే రోల్‌బ్యాక్ సదుపాయాన్ని వినియోగించి లోపాలను సరిదిద్దాలని చెప్పారు. 85 ఏళ్లు దాటిన ఓటర్ల వివరాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు దోషరహిత ఓటరు జాబితా సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ప్రభుత్వ సాధారణ పరిపాలన (ఎన్నికలు) శాఖ అదనపు కార్యదర్శి శ్రీ ఎన్. శంకర్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్ఏసీ) శ్రీ జి.ఎస్. చారి, రాష్ట్రంలోని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ & హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్ఓలు), నోడల్ అధికారులు, సంబంధిత సెక్షన్ అధికారులు మరియు ప్రాజెక్ట్ మేనేజర్ (ఐటీ) తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
మంగళవారం 04.08.2026



## వేదిక
Peoples Voice

మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# భోగాపురం ప్రత్యేకతలు



భోగాపురంలోని అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నేడు (ఆగస్టు 1న) ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. దాదాపు రెండు దశాబ్దాల కిందట ప్రతిపాదనగా మొదలైన ఈ ప్రాజెక్టు.. ప్రభుత్వాల మార్పు, భూసేకరణ, కోర్టు వివాదాలు దాటి ఇప్పుడు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది.

ఆధునిక నిర్మాణశైలితో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన టెర్మినల్, వేగవంతమైన ప్రయాణికుల సేవలు, భవిష్యత్తులో పెరిగే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా నిర్మించిన మౌలిక వసతులు ఈ విమానాశ్రయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని కేంద్ర విమానయానశాఖ చెబుతోంది. ఇంతకీ ఈ విమానాశ్రయం ప్రయాణం ఎలా మొదలైంది? ఎలాంటి మలుపులు తిరిగింది? ఇందులోని ప్రత్యేకతలు ఏమిటి?

### ఇద్దరు సీఎంలు, రెండుసార్లు శంకుస్థాపన

విశాఖ విమానాశ్రయం విస్తరణకు నేవీ పరిమితులు ఉండటంతో, కొత్త గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం అవసరమనే ప్రతిపాదన రెండు దశాబ్దాల కిందటే తెరపైకి వచ్చింది.రాష్ట్ర విభజన తర్వాత ఈ ప్రాజెక్టు మరింత వేగం అందుకుంది. అందులో భాగంగా భోగాపురం ప్రాంతంలో విమానాశ్రయాన్ని నిర్మించాలని ఏపీ ప్రభుత్వం తీర్మానించింది. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు 2015 మే 20న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలిసారిగా ఆమోదం తెలిపింది. 2016 అక్టోబర్ 7న కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనుల పర్యవేక్షణకు భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ (BIACL)ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత మొదలైన భూసేకరణలో జాప్యం, పరిహార వివాదాలు, ప్రభుత్వాల మార్పులతో ప్రాజెక్ట్ ఆలస్యమైంది.

2019, ఫిబ్రవరి 14న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత, 2023 మే 3న అప్పటి సీఎం వైఎస్ జగన్ మరోసారి భూమి పూజ చేశారు.

ప్రాజెక్టుకు రెండు వేర్వేరు ప్రభుత్వాల హయాంలో రెండుసార్లు శంకుస్థాపనలు జరిగాయి. 'ఉత్తరాంధ్రకు చెందిన కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా 2024లో బాధ్యతలు తీసుకోవడంతో ప్రాజెక్ట్ వేగం పెరగిందని' తెలుగుదేశం పార్టీ చెబుతోంది. అయితే, తమ హయాంలోనే పనులన్నీ పూర్తి చేశామని వైసీపీ అంటోంది. 'ఏ ప్రాజెక్టు ప్రారంభించినా అది పూర్తి చేయడం ప్రభుత్వాల బాధ్యత. ఒక ప్రభుత్వం మొదలుపెడితే మరో ప్రభుత్వం ఆ పనులను కొనసాగిస్తుంది. భోగాపురం ఎయిర్‌పోర్ట్ విషయంలో క్రెడిట్ పార్టీలకు కాదు, ప్రభుత్వాలకే చెందుతుంది' అని బీబీసీతో రాజకీయ విశ్లేషకులు ఎం.యుగంధర్ రెడ్డి చెప్పారు.

### భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రత్యేకతలు..

ట్రయల్ రన్ సందర్భంగా జీఎంఆర్ గ్రూప్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఇందన ప్రభాకరరావు బీబీసీతో మాట్లాడారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం, 2024 నవంబరులో ఈ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా పేరు పెట్టారు.విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని జీఎంఆర్ గ్రూప్ (GVIAL) అభివృద్ధి చేసింది.తొలి దశ నిర్మాణానికి సుమారు రూ.4,700 కోట్లకు పైగా వ్యయం కాగా, దాదాపు 31 నెలల్లో నిర్మాణం పూర్తయింది. మొత్తం 2,700 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. ఇందులో 2,203 ఎకరాల్లో విమానాశ్రయం నిర్మించగా, మరో 500 ఎకరాలను భవిష్యత్ విస్తరణ కోసం కేటాయించారు.

### 22 ఏరోబ్రిడ్జిలు ఏర్పాటు

తొలి దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికుల సంఖ్యకు అనువుగా నిర్మించగా, రెండో దశలో దీన్ని 1.2 కోట్ల మంది ప్రయాణికులను నిర్వహించే స్థాయికి విస్తరించే ప్రణాళిక ఉంది.బోయింగ్ 777, బోయింగ్ 787, ఎయిర్‌బస్ A350 వంటి భారీ వైడ్ బాడీ విమానాల రాకపోకలకు అనువుగా 3.8 కిలోమీటర్ల పొడవున్న రన్‌వేను రూపొందించినట్లు ప్రభాకరరావు తెలిపారు.భోగాపురం ఎయిర్‌పోర్టు విశాఖపట్నం నుంచి 55 కిలోమీటర్లు, విజయనగరానికి 25 కిలోమీటర్లు, శ్రీకాకుళానికి 55 కిలో మీటర్ల దూరంలో ఉంది.

### టెర్మినల్ ప్రత్యేకతలు

ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలు, కళా వైభవాన్ని చాటిచెప్పేలా బొబ్బిలి వీణ, కూచిపూడి, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారీ కళాఖండాలతో టెర్మినల్ ను తీర్చిదిద్దినట్లు మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం...టెర్మినల్‌లో 40 చెక్-ఇన్ కౌంటర్లు, 12 డిజీయాత్రా ప్రవేశ గేట్లు, ఆధునిక బ్యాగేజ్ హ్యాండ్లింగ్ సిస్టమ్, ఫుడ్ కోర్ట్, రిటైల్ షాపులు, వీఐపీ లాంజ్, కరెన్సీ ఎక్స్ఛేంజ్, డిజిటల్ ఫ్లైట్ డిస్‌ప్లే, ప్రత్యేక హెల్ప్‌డెస్కులు ఉన్నాయి. ఐదు వేల చదరపు మీటర్ల కార్గో టెర్మినల్ ద్వారా ఏటా 20 వేల మెట్రిక్ టన్నుల సముద్ర ఉత్పత్తులు, ఔషధాలు, వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసే సామర్థ్యాన్ని కల్పించారు. అంతర్జాతీయ విమానాల రాకపోకలకు వీలుగా కేంద్ర ప్రభుత్వం దీనిని ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టుగా ప్రకటించగా, డీజీసీఏ నుంచి ఎయిరోడ్రోమ్ లైసెన్స్ కూడా లభించింది. సహజ కాంతి వినియోగం, విద్యుత్ పొదుపు వ్యవస్థలు, వర్షపు నీటి సంరక్షణ, నీటి పునర్వినియోగం వంటి పర్యావరణహిత సదుపాయాలతో విమానాశ్రయాన్ని నిర్మించారు. వికలాంగుల కోసం వీల్‌చైర్ సేవలు, ర్యాంపులు, లిఫ్టులు, ప్రత్యేక వాష్‌రూమ్‌లు, ప్రత్యేక పార్కింగ్‌తో పూర్తిస్థాయి బారియర్-ఫ్రీ టెర్మినల్‌ను అందుబాటులో ఉంచారు. అయితే, ఈ ప్రాజెక్టు వివాదాలకు కూడా కేంద్రంగా నిలిచింది.

భూసేకరణలో రైతులకు తగిన పరిహారం అందలేదని, మత్స్యకారుల జీవనోపాధిపై ప్రభావం పడుతుందని సీపీఎం సహా పలు రైతు సంఘాలు గతంలో నిరసనకు దిగాయి. ప్రభుత్వం మాత్రం చట్టబద్ధంగానే భూసేకరణ జరిగిందని, పునరావాసం, పరిహారం కల్పించామని తెలిపింది.

### అనుసంధానమే అసలు సవాల్

ఇప్పటి వరకు విశాఖ విమానాశ్రయం నగరానికి సమీపంలో ఉండటంతో చాలా ప్రాంతాల నుంచి 7-8 కిలోమీటర్ల ప్రయాణంతోనే చేరుకునే వీలుండేది. ఇప్పుడు భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో విశాఖ నగరం నుంచి 50-55 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. ట్రాఫిక్‌ను బట్టి గంట నుంచి గంటన్నర సమయం పట్టే అవకాశం ఉంది. 'విమానాశ్రయానికి అనుసంధానంగా ప్రతిపాదించిన 12 ప్రధాన రహదారుల అభివృద్ధిపై ఇంకా స్పష్టత లేదు. తగిన కనెక్టివిటీ లేకపోతే ప్రయాణికులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. కొంత మందికి విమాన టికెట్ కంటే విమానాశ్రయానికి రాకపోకలకు అయ్యే ఖర్చే ఎక్కువయ్యే పరిస్థితి రావచ్చు' అని విశాఖ ఎయిర్ ప్యాసింజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓ.నరేష్ కుమార్ బీబీసీతో అన్నారు. ఈ అంశంపై విశాఖ ఎంపీ శ్రీ భరత్ మాట్లాడారు. "విశాఖ నుంచి భోగాపురం విమానాశ్రయానికి 45 నిమిషాల్లో చేరుకునేలా బీచ్ కారిడార్‌తో నగరం, శివారు ప్రాంతాల అనుసంధాన రహదారులను అభివృద్ధి చేశాం. జాతీయ రహదారులతో కనెక్టివిటీ కల్పించడంతో పాటు ప్రయాణికుల కోసం ప్రత్యేక ఈ-బస్సులను కూడా అందుబాటులోకి తీసుకొచ్చాం' అని ఆయన బీబీసీకి తెలిపారు.

### ఉత్తరాంధ్రకు ప్రయోజనమేంటి?

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమాశ్రయంతో ఉత్తరాంధ్రకు గణనీయమైన ప్రయోజనాలున్నాయని ఎయిర్ ప్యాసింజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓ.నరేష్ కుమార్ అంటున్నారు. 'పర్యాటక రంగానికి పెద్ద ఊతంతో పాటు ఐటీ, డేటా సెంటర్లు, పరిశ్రమల రంగాలకు పెట్టుబడులను ఆకర్షించడంలో ఈ విమానాశ్రయం కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది. వేలాది ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు, సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు పెరిగే అవకాశం. హోటళ్లు, లాజిస్టిక్స్, గిడ్డంగులు, ఏవియేషన్ సేవల అభివృద్ధితో ఉత్తరాంధ్ర జాతీయ, అంతర్జాతీయ వ్యాపార కేంద్రంగా మారే అవకాశం ఉంది' అని ఆయన అభిప్రాయపడ్డారు. ఎయిర్ పోర్టు చుట్టూ ఏరోసిటీ, ఎంఆర్‌ఓ (మెయింటెనెన్స్, రిపెయిర్ అండ్ ఓవర్‌హాల్) కేంద్రాలు, లాజిస్టిక్స్ పార్కులు, ఏవియేషన్ ట్రైనింగ్ సెంటర్లు, కన్వెన్షన్ సెంటర్లు, వాణిజ్య సముదాయాల అభివృద్ధి జరుగుతుందన్నారు.

### విశాఖ విమానాశ్రయం ఏం కానుంది?

విశాఖ విమానాశ్రయం నేవీ ఆధీనంలో ఉండటంతో భవిష్యత్ విస్తరణ సాధ్యం కాదని, అందుకే భోగాపురంలో కొత్త విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసినట్లు ప్రభుత్వం చెబుతోంది. భోగాపురం విమానాశ్రయాన్ని ఆగస్టు 1న ప్రారంభిస్తున్నప్పటికీ, అక్కడి నుంచి సాధారణ విమాన సర్వీసులు ఆగస్టు 16 అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానున్నాయి. అప్పటి వరకు విశాఖ విమానాశ్రయం నుంచే ప్రయాణికుల విమానాల రాకపోకలు కొనసాగుతాయి. ఆగస్టు 17 నుంచి విశాఖ విమానాశ్రయాన్ని ప్రధానంగా రక్షణ శాఖ విమానాలు, అత్యవసర సేవలు, ప్రత్యేక విమానాల నిర్వహణకే వినియోగించనున్నారు.

విశాఖ విమానాశ్రయాన్ని కూడా కొనసాగిస్తే మంచిదని, ఇప్పటికే దేశంలో పలు ప్రాంతాల్లో కొత్త ఎయిర్ పోర్టులు వచ్చినా పాత ఎయిర్ పోర్టులను కొనసాగిస్తున్నారని నరేష్ కుమార్ అభిప్రాయపడ్డారు.

# బ్రహ్మ ముహూర్తం అంటే ఏంటి?

## తెల్లవారుజామునే ఎందుకు నిద్ర లేవాలి

బ్రహ్మ ముహూర్తం అంటే తెల్లవారు జామున అని తెలుసు కానీ, సరైన సమయం ఎప్పుడు?– బ్రాహ్మీ ముహూర్తానికి ఎందుకంత ప్రాధాన్యత? అనే విశేషాలు తెలుసుకుందాం.

సనాతన సంప్రదాయం ప్రకారం బ్రహ్మ ముహూర్తంలో నిద్ర లేవడం, పూజ చేయడం, పిల్లలు చదువుకోవడం మంచిదని అంటారు. అయితే అసలు బ్రహ్మ ముహూర్తంలోనే ఎందుకు నిద్రలేవాలి ? ఈ సమయంలో జరిపే పూజలకు అంతటి శక్తి ఉంటుందా అంటే శాస్త్రం అవుననే అంటోంది. ఈ విషయంపై మరిన్ని వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

### బ్రాహ్మీ ముహూర్తం ఎప్పుడు?

సూర్యోదయానికి సరిగ్గా 48 నిమిషాల ముందు వచ్చే సమయాన్ని బ్రాహ్మీ ముహూర్తం అంటారు. అలాగే రాత్రి భాగంలోని ఆఖరి 48 నిమిషాలను, సూర్యోదయానికి ముందు 48 నిమిషాలను బ్రహ్మ ముహూర్తం అంటారు.

### పూజలకు శ్రేష్టం

బ్రాహ్మీ ముహూర్తం పూజలు, జపాలకు, ధ్యానానికి, మంత్ర సాధనకు విశిష్టమైన సమయంగా చెబుతారు.

### విద్యార్థులకు

విద్యార్థులు బ్రాహ్మీ ముహూర్తంలో నిద్ర లేచి చదువుకుంటే ఏకాగ్రత పెరుగుతుందని, చదువుకున్నది బాగా గుర్తుంటుందని నమ్మకం.

### జీవక్రియలు

మన శరీరంలో జీవ గడియారం ఉంటుంది. దీన్నే ఆంగ్ల పరిభాషలో 'బయోలాజికల్ క్లాక్' అంటారు. దీన్ని అనుసరించే మన జీవ క్రియలన్నీ జరుగుతాయి. అలాగే ఉదయం మనలో కార్టిసోల్ హార్మోన్ ఎక్కువ మోతాదులో విడుదల అవుతుంది. ఈ హార్మోన్ మనలోని ఒత్తిడిని తగ్గిస్తుంది. అలాగే జ్ఞాపకశక్తిపై ప్రభావం చూపుతుంది. అందుకే పిల్లలు బ్రాహ్మీ ముహూర్తంలో చదువుకుంటే చక్కగా గుర్తుంటుందట.

### ఒత్తిడి

ఆధునిక జీవితంలో పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ ఒత్తిడి సాధారణమైంది. ఈ క్రమంలో ముందు రోజు భరించిన ఒత్తిడులు అన్ని నిద్రలో మరిచిపోతాం. అందుకే బ్రాహ్మీ ముహూర్త సమయంలో మెదడు నూతన ఉత్తేజంతో ఉంటుంది. పరిసరాలు కూడా నిశ్శబ్దంగా ఉంటాయి. ఈ కారణాల వల్ల చదివింది మెదడులో జాగ్రత్తగా నిక్షిప్తం అవుతుంది.

### ఆరోగ్యదాయకం

ఆయుర్వేదం ప్రకారం రాత్రి తొందరగా నిద్రపోయి, ఉదయం సూర్యోదయానికి ముందే నిద్ర లేచేవారికి అనారోగ్య సమస్యలు రావు. ఈ సమయంలో చెట్లు తాజా ఆక్సిజన్ విడుదల చేస్తాయి. అది మన ఆరోగ్యానికి ఎంతో మంచిది.

### ఒత్తిడి దూరం

రాత్రంతా చెట్లు వదిలిన ఆక్సిజన్ వేకువ జామున కాలుష్యం బారిన పడకుండా ఎక్కువ పరిమాణంలో మనకు అందుబాటులో ఉంటుంది. సూర్యోదయానికి ముందు రోజును ఆరంభించే వారికి ఇది చాలా ఉపయోగపడుతుంది. అందుకే బ్రాహ్మీ ముహూర్తంలో లేవడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుంది.

### సూర్యోదయం

ఆరోగ్యప్రదాత అయిన సూర్యునికి ప్రతిరోజు సూర్యోదయం సమయంలో అర్ఘ్యం ఇవ్వడం, సూర్య నమస్కారాలు చేయడం, ఆదిత్య హృదయం పారాయణ చేయడం వలన ఆరోగ్య ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని మార్కండేయ పురాణం చెబుతోంది. శాస్త్రీయంగా చూసినా ప్రతిరోజు సూర్యోదయం చూసే అలవాటు ఉన్నవారికి గుండె, మెదడు, ప్రశాంతంగా ఆరోగ్యంగా ఉంటాయని తెలుస్తోంది.

### ఆధ్యాత్మిక వృద్ధి

'బ్రాహ్మీ' అనగా సరస్వతి దేవి అనుగ్రహంతో లభించే జ్ఞానం. మనలోని బుద్ధిని, జ్ఞానాన్ని మేల్కొలిపే సమయం కనుక ఈ బ్రాహ్మీ ముహూర్త సమయానికి అంత ప్రాధాన్యత ఉంది. పురాణాల ప్రకారం భూలోకంలో మొదటగా కనిపించిన కాలాన్ని బ్రహ్మ ముహూర్త కాలమని పిలుస్తారు ఆ సమయానికి ఏ నక్షత్రాలు, గ్రహాలు కూడా కీడు చేయలేవు. కనుక ఇలాంటప్పుడు చేసే శుభకార్యాలకుకానీ, పూజలు, యజ్ఞాలు వంటి పవిత్ర కార్యాలకు కానీ ముహూర్తాలు కూడా చూడాల్సిన అవసరం లేదని జ్యోతిష్య శాస్త్రం చెబుతోంది. మన మహర్షులు, ఋషులు బ్రాహ్మీ ముహూర్తంలో చేసిన తపస్సులతో భగవత్ సాక్షాత్కారం పొందిన నిదర్శనాలు ఎన్నో ఉన్నాయి. అందుకే బ్రాహ్మీ ముహూర్తానికి అంతటి విశిష్టత! మనం కూడా బ్రాహ్మీ ముహూర్తంలో దైవారాధన చేద్దాం, భగవంతుని అనుగ్రహంతో జ్ఞానసిద్ధిని పొందుదాం.




# ఆదర్శ విద్యార్థి జీవన సూత్రాలు

విద్యార్థి జీవితం మనిషి వ్యక్తిత్వ నిర్మాణానికి పునాది. ఒక దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుంది. విద్య అనేది కేవలం పుస్తక జ్ఞానం కాదు; అది క్రమశిక్షణ, శీలం, ఆత్మవిశ్వాసం, బాధ్యతలను పెంపొందించే జీవన విధానం. మన ప్రాచీన భారతీయ సంస్కృతిలో విద్యార్థికి ఐదు ముఖ్యమైన లక్షణాలను సూచించారు. అవి – 'కాక చేష్ట, బకో ధ్యానం, కుక్క లాంటి నిద్ర, అల్పాహారి, గృహత్యాగి' ఈ ఐదు సూత్రాలు నేటి విద్యార్థి జీవితానికీ ఎంతో ఉపయోగకరమైనవి.

### కాక చేష్ట

కాకి ఎప్పుడూ చురుకుగా, అప్రమత్తంగా ఉంటుంది. ఏ అవకాశాన్ని వదులుకోదు. అదే విధంగా విద్యార్థి కూడా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, గురువు చెప్పే విషయాలను శ్రద్ధగా గ్రహిస్తూ, సందేహాలను వెంటనే నివృత్తి చేసుకుంటూ ముందుకు సాగాలి. చురుకుదనం విజయానికి మొదటి మెట్టు.

### బకో ధ్యానం

బకపక్షి తన లక్ష్యంపై సంపూర్ణ ఏకాగ్రతతో దృష్టి పెడుతుంది. అలాగే విద్యార్థి చదువులో ఏకాగ్రతను పెంపొందించుకోవాలి. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వంటి వాటి వల్ల దృష్టి మరలకుండా ఒకే లక్ష్యంపై కేంద్రీకరించాలి.

### కుక్క లాంటి నిద్ర

కుక్క నిద్రలో కూడా అప్రమత్తంగా ఉంటుంది. విద్యార్థి కూడా తగినంత నిద్రపోయి, సమయానికి మేల్కొని, సమయపాలన పాటించాలి. అధిక నిద్ర కూడా మంచిది కాదు, తక్కువ నిద్ర కూడా ఆరోగ్యానికి హానికరం.

### అల్పాహారి

మితాహారం ఆరోగ్యానికి మూలం. అధికంగా తినడం వల్ల అలసట, నిద్రమత్తు వస్తాయి. పోషకాహారం, మితాహారం తీసుకుంటే శరీరం ఆరోగ్యంగా ఉండి, చదువుపై ఏకాగ్రత పెరుగుతుంది.

### గృహ త్యాగి

ఇది ఇంటిని వదిలేయడం కాదు. కుటుంబ సౌకర్యాలపై ఎక్కువగా ఆధారపడకుండా, స్వీయ క్రమశిక్షణతో, లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని జీవించడం. తాత్కాలిక సుఖాలను త్యజించి, భవిష్యత్తు విజయాన్ని లక్ష్యంగా పెట్టుకోవడం నిజమైన విద్యార్థి లక్షణం.

### నేటి విద్యార్థులకు సందేశం

ప్రస్తుతం సాంకేతిక పరికరాల వినియోగం, సోషల్ మీడియా ప్రభావం వల్ల ఏకాగ్రత తగ్గుతోంది. సమయపాలన లోపిస్తోంది. ఇలాంటి సమయంలో ఈ ప్రాచీన జీవన సూత్రాలు విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తాయి.




కాక చేష్ట, బకో ధ్యానం, కుక్క లాంటి నిద్ర, అల్పాహారి, గృహ త్యాగి అనే ఈ ఐదు జీవన సూత్రాలను ఆచరణలో పెట్టిన విద్యార్థి తప్పకుండా విజయం సాధిస్తాడు. విద్య కేవలం డిగ్రీల కోసం కాదు; మంచి వ్యక్తిత్వ నిర్మాణం కోసం అనే విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలి.

**- నరేష్ , ముద్ర**

# నిద్రపట్టకపోవడానికి కారణం ఇదే

**ముద్ర డెస్క్:**
రాత్రి పడుకున్న వెంటనే నిద్రపట్టాలని చాలా మంది అనుకుంటారు. కానీ ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ ఆలోచనలు ఉండడం వల్ల బెడ్ పైకి వెళ్లిన వెంటనే నిద్ర రాదు. కొందరు గంటల తరబడి మెలకువగానే ఉంటారు. మరికొందరికి నిద్ర పట్టినా మధ్య మధ్యలో మెలకువ వస్తుంటుంది. దీనిక ప్రధాన కారణం కార్టిసాల్ అనే హార్మోన్ అసమతుల్యత అని కొందరు వైద్య నిపుణులు అంటున్నారు. అసలేంటీ ఈ కార్టిసాల్ హార్మోన్? కార్టిసాల్ అనేది అడ్రినల్ గ్రంథులు ఉత్పత్తి చేసే హార్మోన్. ఇది శరీరంలో శక్తి వినియోగం, రక్తంలో చక్కెర స్థాయిలు, రోగనిరోధక వ్యవస్థలను నియంత్రిస్తుంది. సాధారణంగా ఉదయం లేవగానే ఈ హార్మోన్ స్థాయిలు ఎక్కువగా ఉండి, రోజంతా క్రమంగా తగ్గుతూ రాత్రి నిద్రపోయే సమయానికి చాలా తక్కువగా ఉండాలి. అప్పుడు మాత్రమే శరీరం విశ్రాంతి మోడ్‌లోకి వెళ్లి నిద్ర సులభంగా పడుతుంది. ఒక శరీరంలో ఒత్తిడి ఎక్కువగా ఉండటం వల్ల రాత్రి సమయంలో కూడా కార్టిసాల్ స్థాయిలు తగ్గకుండా ఉంటాయి. దీంతో మెదడు అప్రమత్తత అనే స్థితిలోనే ఉంటుంది. దీంతో నిద్ర పట్టడానికి ఎక్కువ సమయం పడుతుంది. దీర్ఘకాలం ఇలా కొనసాగితే శారీరక, మానసిక ఆరోగ్యం రెండూ దెబ్బతింటాయి.

**తిన్నది ఒంటబట్టడానికి**

ప్రతిరోజూ వ్యాయామం చేయండి. రోజుకు కనీసం 30 నిమిషాలు నడక లేదా తేలికపాటి వ్యాయామం చేయడం వల్ల మెటాబాలిజం పెరిగి తిన్న ఆహారం శక్తిగా మారేందుకు సహాయపడుతుంది.



# ఆగస్టు 15న తిరంగా ర్యాలీ నిర్వహిద్దాం

**జాతీయ సమైక్యతను చాటుదాం**
**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కీర్తి రెడ్డి**




**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 3:** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని "నా దేశం.. నా గౌరవం.. నా తిరంగా" నినాదంతో ఆగస్టు 15న భారీ తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కీర్తి రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖండ భారతి సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు.ఈ సందర్భంగా కీర్తి రెడ్డి మాట్లాడుతూ, దేశ సమైక్యతను, జాతీయ భావాన్ని యువతలో మరింత బలోపేతం చేయడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమన్నారు. "మేం భారతీయులమని గర్వంగా చెప్పగల యువతరమే దేశ బలం. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనే ఎన్ని కుట్రలు జరిగినా జాతీయ సమైక్యతను దెబ్బతీయలేవు" అని అన్నారు.త్రివర్ణ పతాకం వెనుక ఎన్నో త్యాగాలు, స్వాతంత్ర్య సమర యోధుల పోరాటాలు ఉన్నాయని, వాటిని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశ చరిత్ర, జాతీయ గౌరవాన్ని భావితరాలకు పరిచయం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని చెప్పారు.దేశ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న సైనికుల త్యాగాలను ప్రతి భారతీయుడు గుర్తుంచుకోవాలని కీర్తి రెడ్డి పిలుపునిచ్చారు. దేశ సమైక్యతను దెబ్బతీసేలా మాట్లాడే వారికి యువత తమ ఐక్యతతో సమాధానం చెప్పాలని పేర్కొన్నారు.ఈ తిరంగా ర్యాలీలో మహిళా విభాగం సమన్వయ బాధ్యతలు తనకు అప్పగించడం ఆనందంగా ఉందని తెలిపారు. దేశాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఆగస్టు 15 ఉదయం 7 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ గజ్వేల్, సిద్ధిపేట, సిరిసిల్ల మీదుగా కరీంనగర్ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొంటారని వెల్లడించారు.మీడియా సమావేశంలో అఖండ భారతి ఫౌండేషన్ సభ్యులు సింథల్, సినీ నటుడు జై సిద్ధార్థ్, హెచ్‌ఆర్ హిమబిందు, యాంకర్ సహానా తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఏడాది కుంభవృష్టి

**ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి**
**ఉజ్జయిని మహంకాళి బోనాల్లో భవిష్య వాణి పలికిన అమ్మవారు**



**ముద్ర, హైదరాబాద్:** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి లష్కర్ బోనాల ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రంగం కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పచ్చికుండపై నిలబడి మాతంగి స్వర్ణలత సంప్రదాయ పద్ధతిలో భవిష్యవాణి వినిపించారు.భవిష్యవాణిలో ఈ ఏడాది కుంభవృష్టి వర్షాలు కురుస్తాయని, కొన్ని ప్రాంతాల్లో వరదల కారణంగా ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలు కూడా జరిగే అవకాశముందని హెచ్చరిస్తూ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అలాగే సమాజంలో ప్రజలు వావివరసలు లేకుండా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "ఏ ఆపద వచ్చినా అమ్మవారి కరుణతో ప్రజలను కాపాడుతున్నాను. అందరూ జాగ్రత్తగా ఉండాలి" అని తెలిపారు.ఈ సందర్భంగా కంటతడి పెట్టిన మాతంగి స్వర్ణలత, తన విగ్రహ ప్రతిష్ఠ ఇంకా ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తూ, ఆరు నెలల్లో విగ్రహ ప్రతిష్ఠ జరగాలని అన్నారు. తనకు అడ్డొచ్చిన వారిని అమ్మవారే శిక్షిస్తారని కూడా వ్యాఖ్యానించారు.రంగం కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. మాతంగి స్వర్ణలత భవిష్యవాణిని భక్తులు భక్తిశ్రద్ధలతో ఆలకించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు వినతి



**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 3:** రాష్ట్రంలోని డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు సోమవారం తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ బాలకృష్ణ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు రాకేష్ దత్త మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బకాయిల కారణంగా అనేక కళాశాలలు విద్యార్థులపై ఫీజులు చెల్లించాలంటూ ఒత్తిడి తెస్తూ, సర్టిఫికెట్లు ఇవ్వబోమని హెచ్చరిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ అంశాన్ని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లామని, ఫీజు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు జారీ చేయాలని ప్రభుత్వం స్పష్టమైన జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.అలాగే గతంలో అమలులో ఉన్న విధానాన్ని కొనసాగిస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విద్యార్థుల ఖాతాల్లో కాకుండా నేరుగా కళాశాలల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. దీంతో విద్యార్థులు మధ్యలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా చదువును కొన సాగించగలరని చెప్పారు.పేద మరియు మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థి నాయకులు కోరారు.

## కుషాయిగూడ బస్ స్టాప్ పరిరక్షణ కోసం మహా ధర్నా

**అధికారుల హామీతో విరమణ**



**ముద్ర, కుషాయిగూడ:** కుషాయిగూడ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్ల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కుషాయిగూడ బస్ స్టాప్ భవిష్యత్తుపై ఏర్పడిన అనిశ్చితి, అలాగే అక్రమ చలాన్ల పేరుతో ప్రజలు, వర్తకులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నిరసిస్తూ కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కుషాయిగూడ బస్ స్టాప్ వద్ద మహా ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు,గ్రామ పెద్దలు, వర్తకులు, వ్యాపారులు, యువత , స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ట్రాఫిక్ పోలీసుల చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ధర్నాలో పాల్గొన్న ప్రజలు కుషాయిగూడ బస్ స్టాప్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను వెంటనే తొలగించాలని, అక్రమ చలాన్ల విధానాన్ని నిలిపివేయాలని, అలాగే గతంలో నిలిపివేయబడిన 3K మరియు 17 బస్సు సర్వీసులను తక్షణమే పునరుద్ధరించి, కుషాయిగూడ ప్రజలకు పూర్తి స్థాయిలో రవాణా సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.ధర్నా జరుగుతున్న సమయంలో లా అండ్ ఆర్డర్ సీఐ భాస్కర్ రెడ్డి , ట్రాఫిక్ సీఐ మల్లేష్ సంఘటన స్థలానికి చేరుకుని అసోసియేషన్ ప్రతినిధులతో చర్చించారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలను పూర్తిగా పరిశీలించి, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అధికారులు ఇచ్చిన హామీని గౌరవిస్తూ, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ తాత్కాలికంగా ధర్నాను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. అయితే, హామీ మేరకు సమస్యలు పరిష్కారం కాకపోతే భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో ప్రజా ఉద్యమాలు చేపట్టేందుకు వెనుకాడబోమని అసోసియేషన్ స్పష్టం చేసింది.

## స్టార్ ఆస్పత్రి డేటా లీక్‌పై కేసు నమోదు

**రోగుల వ్యక్తిగత, వైద్య సమాచారం వెబ్‌సైట్‌లో ప్రత్యక్షం**
**టీజీసీఎస్‌బీ దర్యాప్తు ప్రారంభం**



**ముద్ర, హైదరాబాద్:** ప్రముఖ స్టార్ హాస్పిటల్స్‌కు చెందిన రోగుల వ్యక్తిగత, వైద్య సమాచారం (సెన్సిటివ్ హెల్త్ డేటా), ఉద్యోగుల వివరాలు, ఆస్పత్రి అంతర్గత గోప్య సమాచారం అక్రమంగా ఓ వెబ్‌సైట్‌లో ప్రచురితమైన ఘటనపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్టార్ హాస్పిటల్స్ సీఈవో రాహుల్ మెడక్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. ఆస్పత్రికి చెందిన గోప్య సమాచారం ఎలాంటి అనుమతి లేకుండా warehouse.diy అనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు ఐటీ బృందం గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వెబ్‌సైట్‌లోకి ప్రవేశించేందుకు అవసరమైన లాగిన్ వివరాలను కొందరు వాట్సాప్ ద్వారా పంచుకున్నట్లు కూడా గుర్తించినట్లు తెలిపారు.లీకైన డేటాలో రోగుల వ్యక్తిగత వివరాలు, వైద్య రికార్డులు, ఉద్యోగుల సమాచారం, ఆస్పత్రి అంతర్గత పత్రాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సమాచారం బహిరంగంగా ఉండటం వల్ల గుర్తింపు చోరీ, ఆర్థిక మోసాలు, వ్యక్తిగత వేధింపులు, అలాగే సంస్థ ప్రతిష్ఠకు నష్టం కలిగే అవకాశం ఉందని ఫిర్యాదులో వివరించారు. ఈ కేసు దర్యాప్తును ఇన్‌స్పెక్టర్ డి. శ్రీనుకు అప్పగించారు.

## సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధికి నిధులు కేటాయించండి

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**




**ముద్ర, కాప్రా:** ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు ప్రజా సమస్యల పరిష్కారానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, కాలనీల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.సమస్యలను సవివరంగా విన్న కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని అర్హమైన సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించే ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని, ప్రతి సమస్యకు పరిష్కారం చూపే వరకు అధికారులతో సమన్వయం చేస్తూ ముందుకు సాగుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పూజిత ఎన్ క్లేవ్ కాలనీ ఎన్నికలు

**అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా, అనంతుల, రేపాల**



**ముద్ర, హైదరాబాద్ (నిజాంపేట్):** హైదరాబాద్ మహా నగరంలోని అతిపెద్ద కాలనీలో ఒకటైన బాచు పల్లి మున్సిపాలిటీ నిజాంపేట్. రాజీవ్ గాంధీ నగర్ లోని పూజిత ఎన్ క్లేవ్ కాలనీకి పోటా పోటీగా ప్రశాంతంగా ఆదివారం ఎన్నికలు జరిగాయి. ఫలితాలు వెలువడిన అనంతరం కాలనీలోని అపార్ట్ మెంట్ లో విజయోత్సవ వేడుకలు జరిగాయి. ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షునిగా అనంతుల విద్యాసాగర్, ఉపాధ్యక్షులుగా పుట్టూరి శ్రీనివాసరెడ్డి , బొడ్డు నాగరాజు ప్రధాన కార్యదర్శిగా రేపాల శ్రీనివాసరావు చౌదరి సంయుక్త కార్యదర్శులుగా కాటే పల్లి హరిబాబు, వేగుళ్ల మణి అశ్విని జ్యోతి కోశాధికారిగా ఎల్ కె నాయుడు సంయుక్త కోశాధికారిగా కంభం నాగార్జున పి ఆర్ ఓ గా ఎం నరసింహారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాలనీ వాసి సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ మరింత మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో శ్రద్ధ వహించాలని కోరారు

## కూకట్‌పల్లి బీజేపీలో నియామకం



**ముద్ర, కూకట్‌పల్లి :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా (అర్బన్) బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులుగా ఫతేనగర్ డివిజన్ సీనియర్ నాయకులు యాదగిరి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్‌గా బాలాజీ నగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు జి. వినోద్ కుమార్ గౌడ్ లు నూతనంగా నియమితులయ్యారు.ఈ సందర్భంగా వారు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నూతన నాయకులను వడ్డేపల్లి రాజేశ్వరరావు శాలువాలతో సన్మానించి ఘనంగా అభినందించారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం లభిస్తుందని స్పష్టం చేశారు.ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేస్తున్న బీసీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ సిద్ధాంతాలను ఇంటింటికీ ప్రచారం చేస్తూ నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు సి.హెచ్. శ్రీనివాస్ గౌడ్, అత్తికరి మల్లేష్, సతీష్ గౌడ్, ఎమ్.ఎస్ రెడ్డి, సూరిబాబు, సంతోష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలకు చెక్కుల పంపిణీ




**ముద్ర, మల్కాజ్‌గిరి:** మల్కాజ్‌గిరి వాణినగర్‌లోని శ్రీ విజయ వినాయక స్వామి దేవాలయంలో తెలంగాణ ప్రభుత్వ దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు–2026 దేవాదాయ ఆర్థిక సహకార చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య , మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆలయాల ప్రతినిధులకు ఆర్థిక సహకార చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తె నియోజకవర్గంలోని 207 దేవాలయాలకు రూ.76 లక్షల 3 వేల ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మోహన్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారులు వెంకన్న, శ్రీనివాసరావు, ప్రధాన అర్చకులు, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, మేకల సునీత, రాము యాదవ్, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను విజయవంతం చేయండి

**రాష్ట్ర ప్రజలకు తెలంగాణ రక్షణ సేన నాయకుల పిలుపు**
**సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో సభ ఏర్పాట్లు పరిశీలన**

**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ రక్షణ సేన నిర్వహిస్తున్న ‘‘సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ’’ను విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన నాయకులు పిలుపునిచ్చారు. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో సభ ఏర్పాట్లను పార్టీ నాయకులు సోమవారం పరిశీలించారు. ఈనెల 6న ఉదయం 10 గంటల నుంచి సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత సహా పలువురు ప్రముఖులు పాల్గొని సామాజిక న్యాయ తెలంగాణ సాధన దిశగా చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేస్తారన్నారు. నాయకులు నరేశ్ ప్రజాపతి, కోల శ్రీనివాస్, ఎత్తరి మారయ్య మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో అన్ని వర్గాలకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం దక్కాలనే సంకల్పంతో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత పని చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు కూడా శాసన మండలి, అసెంబ్లీ వైపు చూడని ఎన్నో కులాల గురించి శాసన మండలిలో కవిత ప్రస్తావించిన అంశాన్ని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్ పార్క్ అభివృద్ధి పనులకు శ్రీకారం

**ముద్ర ప్రతినిధి, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని 12వ వార్డులో ఎమ్మెల్యే శ్రీ బుయ్యాని మనోహర్ రెడ్డి సహకారంతో తాండూర్ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం 12వ వార్డులో రూ.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్ పార్క్ అభివృద్ధి పనులకు చైర్ పర్సన్ భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, యువతతో పాటు అన్ని వయసుల వారు వ్యాయామం చేసేలా ఓపెన్ జిమ్ పార్క్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్, తాండూర్ టౌన్ ప్రెసిడెంట్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పురపాలికను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**శంకర్‌పల్లి చైర్మన్ సాతా ప్రవీణ్‌కుమార్**



**ముద్ర, శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి పురపాలికను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి జిల్లా లో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చైర్మన్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం 11, 14, 15 వార్డులలో రూ.83 లక్షలతో చెపట్టానున్న సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణపు పనులను వైస్ చైర్మన్ శ్వేతా పాండురంగారెడ్డి, కౌన్సిలర్లతో కలసి ప్రారంభించారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య సహకారంతో పనులను పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో కమీషనర్ యోగేష్ కౌన్సిలర్లు, నాయకులు అశోక్ గణేష్ పాండురంగారెడ్డి, చంద్రమౌళి, వెంకటరెడ్డి బాలకృష్ణారెడ్డి పార్సి బాలకృష్ణ వెంకట్రాంరెడ్డి, ఆనంతరెడ్డి. శేఖర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారుల

**తిన్నది ఒంటబట్టడానికి ఒత్తిడిని తగ్గించి సరిపడా నిద్రపోండి**

మానసిక ఒత్తిడి, నిద్రలేమి జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. రోజుకు 7–8 గంటలు నిద్రపోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం వల్ల ఆహారం ఒంటబట్టడంలో శరీరం సమర్థంగా పనిచేస్తుంది.



# బీఆర్ఎస్ అసత్య ప్రచారాన్ని ఖండిస్తూ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం





**ముద్ర, కరీంనగర్ :** ఎల్లంపల్లి ప్రాజెక్టు, నియోజకవర్గ అభివృద్ధిపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నిరసిస్తూ సోమవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నంది మేడారం పంప్ హౌస్ వద్ద ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ఎల్లంపల్లి ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందని, నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. నంది మేడారం చెరువుకు సరఫరా అవుతున్న నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచేనని పేర్కొంటూ, దానిని కాళేశ్వరం నీరుగా ప్రచారం చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని బీఆర్ఎస్ నాయకులపై విమర్శలు గుప్పించారు.

కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి తమ వ్యాఖ్యలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించిన కాంగ్రెస్ నేతలు, రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం మానుకుని ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా స్పందించాలని హితవు పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దివ్యాంగుడికి కోరుట్ల ఎమ్మెల్యే భరోసా



**ముద్ర, కోరుట్ల;** జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. సమస్య పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు వచ్చిన కోరుట్ల నియోజకవర్గానికి చెందిన ఓ దివ్యాంగుడితో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడారు. ఇంత దూరం ఎందుకు వచ్చావని ఇలాంటి సమస్యల కోసం నేరుగా తనకు ఫోన్ చేస్తే తానే చూసుకుంటానంటూ దివ్యాంగుడికి భరోసా కల్పించారు. దీంతో అక్కడున్న వారు ఎమ్మెల్యే స్పందనను అభినందించారు.

## ప్రజా సమస్యల పై ప్రజావాణిలో కలెక్టర్ కు ఎమ్మెల్యే వినతి



**ముద్ర, కోరుట్ల;** జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ జిల్లా కలెక్టర్ ని కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కోరుట్ల పట్టణంలోని గడి బురుజు భూమికి విధించిన వెకెంట్ ల్యాండ్ ట్యాక్స్ ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ మొదటగా వినతిపత్రం అందజేశారు.గడి బురుజు భూమి కోరుట్ల పట్టణానికి చారిత్రక, ప్రజా ప్రాధాన్యం కలిగిన ఆస్తి అని, దానిని ప్రజా ప్రయోజనాల కోసం పరిరక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గడి బురుజు భూమిపై విధించిన వీఎల్‌టిని వెంటనే రద్దు చేసి, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి, ప్రజాభిప్రాయానికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ మరో వినతిపత్రం సమర్పించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యాసంస్థలు ఫీజుల చెల్లింపుపై ఒత్తిడి తెస్తూ సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల విద్యా భవిష్యత్తు దెబ్బతినకుండా ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు, విద్యార్థులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు దారిశెట్టి రాజేష్, కౌనిలర్ కె. వెంకటేష్, నాయకులు ఫయ్యుం, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ దూరదృష్టి వల్లే వరద కాలువలోకి జలాలు

**కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్....**



**ముద్ర, కోరుట్ల;** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ఫలితంగానే నేడు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రాజేశ్వరరావుపేట పంప్‌హౌస్ ద్వారా వరద కాలువలోకి గోదావరి జలాలు చేరుతున్నాయని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. గత రెండు రోజులుగా ఎల్లంపల్లి నుంచి రాజేశ్వరరావుపేట పంప్‌హౌస్ ద్వారా సుమారు అర టీఎంసీ నీటిని వరద కాలువలోకి విడుదల చేసినట్లు పేర్కొన్నారు.ఈ నీటితో ఇప్పటివరకు బీడుగా ఉన్న వేలాది ఎకరాల భూములు సాగుకు అనుకూలంగా మారి సస్యశ్యామలంగా మారనున్నాయని అన్నారు.

తెలంగాణ రైతాంగానికి శాశ్వత సాగునీరు అందించాలనే మహత్తర లక్ష్యంతో కేసీఆర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఒకప్పుడు గోదావరి జలాలు సముద్రంలో కలిసిపోతుండగా, వాటిని సద్వినియోగం చేసేందుకు ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి తెలంగాణ వ్యవసాయ రంగానికి కొత్త దిశ చూపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి ప్రాంతాలతో పాటు వరద కాలువ ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం కలుగుతుందని, భూగర్భ జలాలు పెరిగి రైతులకు, గ్రామీణ ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే అన్నారు.

## అమ్మవారు నడయాడిన క్షేత్రం కంచి

**-బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ**

**ముద్ర, కోరుట్ల;** సాక్షాత్తు పార్వతీదేవి స్వయంగా నడయాడిన ప్రాంతం కంచి పుణ్యక్షేత్రమని శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు, పురాణ ప్రవర బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ పేర్కొన్నారు. సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అష్టాదశ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞంలో భాగంగా శ్రీ బ్రహ్మ మహాపురాణ ప్రవచన సప్తాహం 3వ రోజు కోరుట్ల వాసవి కళ్యాణ భవనంలో సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహేశ్వరశర్మ ప్రవచనం చేస్తూ పార్వతీదేవి కంచి క్షేత్రానికి వచ్చి 'తపో కామాక్షి'గా కొద్ది రోజులు తపస్సు చేస్తూ కంచిలో నివసించిందన్నారు. అమ్మవారు స్వయంగా మృత్తిక లింగాన్ని తయారుచేసి పూజించిందని, ఆ లింగమే ఇప్పుడున్న ఏకాంబరేశ్వరుడన్నారు. ఈ కార్యక్రమంలో సనాతన ధర్మ ప్రచార సమితి నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఎన్సీసీ క్యాడెట్లతో ఘనంగా హరితహారం

**చెట్లను పెంచడం ప్రతి ఒక్కరి ప్రాథమిక విధి – డాక్టర్ వి. నరేందర్ రెడ్డి**



**ముద్ర, కరీంనగర్ :** అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో ఎన్సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దడం కూడా ప్రతి ఎన్సీసీ క్యాడెట్ ప్రాథమిక బాధ్యత అని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ఎన్సీసీ క్యాడెట్లు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యతలకు ప్రతీకలైన ఎన్సీసీ క్యాడెట్లు హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు చెట్ల పెంపకం ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని సూచించారు. ప్రకృతిని కాపాడడం అంటే దేశాన్ని కాపాడినట్లేనని, అదే భావనతో ఎన్సీసీ క్యాడెట్లు సేవలందిస్తున్నారని డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. చెట్ల పెంపకం ద్వారా కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని, చెట్టు మానవాళికి ప్రకృతి ప్రసాదించిన గొప్ప వరమని అన్నారు.

"హరితమే మన బలం – పర్యావరణమే మన సంపద", "దేశభక్తితో పాటు ప్రకృతి భక్తిని కూడా పెంపొందిద్దాం" అనే నినాదాలతో విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

చెట్ల వల్ల మనకు అనేక సహజ వనరులు లభిస్తాయని, పర్యావరణ సమతుల్యతతో పాటు అభివృద్ధికి కూడా అవి దోహదపడతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్,ఎఎన్ఓ సందీప్ సింగ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు , విద్యార్థులు పాల్గొన్నారు

## బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ ప్రచార యాత్ర




**ముద్ర, కరీంనగర్ :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుంచి 14 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రచార యాత్ర నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో జరిగిన జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యదర్శుల సంయుక్త సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. నిత్యావసర వస్తువులు, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే రైతులకు పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించాలన్న డిమాండ్ ఇంకా నెరవేరలేదన్నారు. సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన "బద్లావ్ జరూరీ హై – మార్పు కావాలి" పిలుపు మేరకు నిర్వహించే ఈ ప్రచార యాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి , కసిరెడ్డి సురేందర్ రెడ్డి,నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి,పిట్టల సమ్మయ్య మండల కార్యదర్శులు బండ రాజిరెడ్డి,గోవిందుల రవి, చొక్కల్ల శ్రీశైలం,లంకదాసరి కల్యాణ్,ఎస్. కే .మౌలానా తదితరులు పాల్గొన్నారు

## మెట్ట పంటల సాగు పై రైతులకు అవగాహన



**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల మండలం నాగులపేట్ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మెట్ట పంటల సాగు" పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. "ఎల్నినో ప్రభావం వర్షాభావ పరిస్థితిలలో" ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవని నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు తక్కువ నీటితో సాగయ్యే మెట్ట పంటలను ప్రాధాన్యంగా సాగు చేయాలని సూచించారు. పెసలు, మినుములు, కందులు, సోయాబీన్, వేరుశనగ, జొన్న, పొద్దుతిరుగుడు, ఆయిల్ పామ్ వంటి పంటలు తక్కువ నీటితో మెరుగైన దిగుబడిని అందిస్తాయని, వీటి సాగుతో పెట్టుబడి భారం తగ్గడంతో పాటు రైతులకు లాభదాయకంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, ఏఓ నాగమణి, రైతులు పాల్గొన్నారు.

## బీజేవై ఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న సుమారు ₹15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. విద్యార్థుల సమస్యలు, ఫీజు రీయింబర్స్ మెంట్ పై సంతకాల సేకరణ పలు కళాశాలల్లో నిర్వహించారు. బీజేవై ఎం జిల్లా అధ్యక్షులు నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సూరజ్ నాయక్, సాత్విక్, నాయకులు కందుల హరీష్, వెంకటేష్, భరత్, విజయ్, సృజన్, బంటి, చరణ్, దీక్షిత్, అనిల్, శ్రీకాంత్, మధు, ప్రణయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ లకి కేజీ వీల్స్ వేసి రోడ్లను పాడుచేస్తే కఠిన చర్యలు

**-చిగురుమామిడి ఎస్ఐ జగదీష్ హెచ్చరిక**



**ముద్ర చిగురుమామిడి:** చిగురుమామిడి మండలంలోని రైతులు వర్షాకాలం నాట్ల కోసం పొలాలు దున్నే సమయంలో ట్రాక్టర్లకు ఫుల్ కేజ్ వీల్స్ అమర్చి రోడ్లపై ప్రయాణించవద్దని చిగురుమామిడి ఎస్ఐ జగదీష్ విజ్ఞప్తి చేశారు. ఫుల్ కేజ్ వీల్స్‌తో రోడ్లపై వెళ్లడం వల్ల ప్రభుత్వ నిధులతో నిర్మించిన రహదారులు దెబ్బతిని గుంతలు ఏర్పడి, ప్రజలకు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు.

ఎవరైనా ఫుల్ కేజ్ వీల్స్‌తో రోడ్లపై ట్రాక్టర్లు నడుపుతూ రహదారులను దెబ్బతీస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు రూ.5,000 వరకు జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

రహదారులు దెబ్బతినకుండా రైతులు ఫుల్ కేజ్ వీల్స్‌కు బదులుగా హాఫ్ కేజ్ వీల్స్‌ను ఉపయోగించాలని సూచించారు. రోడ్లు ప్రజలందరి ఆస్తి అని, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నాట్ల సీజన్‌లో రైతులు తగిన జాగ్రత్తలు పాటించి రహదారులు పాడుకాకుండా సహకరించాలని ఎస్ఐ జగదీష్ కోరారు.

## ఎల్ఎండీలో మునిగి యువకుడు మృతి

ముద్ర, కరీంనగర్ : స్నేహితుల దినోత్సవం రోజు విషాదం చోటుచేసుకుంది. కరీంనగర్ జిల్లా దిగువ మానేరు జలాశయం సమీపంలో ఆదివారం స్నేహితులతో గడిపేందుకు వెళ్లిన ఓ యువకుడు నీటిలో మునిగి మృతి చెందారు. గ్రామస్థులు, స్థానికుల కథనం మేరకు తిమ్మాపూర్ మండలం అల్గునూర్‌కు చెందిన గోల్కొండ మణిప్రసాద్(23) తిమ్మాపూర్ మండల కేంద్రంలోని టీ టైం హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని నలుగురు స్నేహితులతో కలిసి రోజంతా ఆనందంగా గడిపారు. సాయంత్రం మానేరు రిజర్వాయర్ జలాశయం తీరానికి వెళ్లి నీటితో ఆనందంగా గడుపుతుండగా.. ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. తోటి స్నేహితులు కాపాడే ప్రయత్నం చేయగా ఫలించలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన చేరుకొని మృతదేహన్ని వెలికి తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై అన్వర్ చెప్పారు.

### తిన్నది ఒంటబట్టడానికి

ప్రోటీన్, ఫైబర్ ఉన్న ఆహారం తీసుకోండి. పప్పులు, కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు వంటి ఫైబర్, ప్రోటీన్ అధికంగా ఉన్న ఆహారం తీసుకుంటే పోషకాలు బాగా శరీరానికి అందుతాయి. జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది.



# ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేతో అభివృద్ధికి ఊతం

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్ జాతీయ రహదారి ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి కొత్త ఊపు తీసుకువస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నూతన హైవేపై ప్రయాణించి రోడ్డు నాణ్యతను పరిశీలించిన ఆయన, ఈ రహదారి తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడంతో పాటు రెండు రాష్ట్రాల ప్రజలకు వారధిగా నిలుస్తుందని తెలిపారు.అమరావతి–నాగ్‌పూర్ జాతీయ రహదారి పూర్తయితే ఖమ్మానికి సహజ సిద్ధమైన రింగ్ రోడ్ లభిస్తుందని చెప్పారు. రైల్వే, జాతీయ రహదారులు, కొత్తగూడెం విమానాశ్రయం, గోదావరి నౌకాయానం వంటి మౌలిక వసతులతో భద్రాద్రి ప్రాంతం పారిశ్రామిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రఘునాథపాలెంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను మంత్రి తుమ్మల, జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, సీపీ సునీల్ దత్‌తో కలిసి పరిశీలించారు. నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ వైద్య కళాశాల పూర్తి కోసం అదనంగా రూ. 64 కోట్ల నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరినట్లు తెలిపారు. సెప్టెంబర్ నాటికి బాలికల హాస్టల్, డిసెంబర్ చివరి నాటికి అన్ని నిర్మాణ పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అలాగే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌లోని అన్ని బ్లాకులు నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి







**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ప్రజలు తమ సమస్యలు తెలిపి సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.ఖానాపురం హవేలీ శివారు టేకుల పల్లికి చెందిన వి. వెంకటయ్య ఈ నెల తనకు వృద్ధాప్య పెన్షన్ డబ్బులు జమ కాలేదని తన బ్యాంకు ఖాతాలో ఆ డబ్బులు జమ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డీఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం నగరం 44వ డివిజన్ లెనిన్ నగర్ కు చెందిన ఎస్.కే నాజియా తన కుమార్తె తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారని, తన కుమార్తె కు ఫించన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డీఓ, సెర్ప్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖమ్మం అర్బన్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఎం. సూర్య ప్రకాష్ పాపిరెడ్డి ఖమ్మం దేవరపల్లి హైవే ధంసలాపురం ఎంట్రీ ఎగ్జిట్ వద్ద ఉన్న తమ భూమికి దారి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడి ఎన్. హెచ్ అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.నేలకొండపల్లి మండలం నాచేపల్లి గ్రామానికి చెందిన వి. రామకృష్ణ తాను పి.జీ చదువుకున్నానని తనకు కంటికి సంబంధించిన దివ్యాంగత్వం ఉందని, తనకు ఏదైనా ఉపాధి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, ప్రజలు పాల్గొన్నారు.

**సూర్యాపేటలో..**

**ముద్ర, సూర్యాపేట:** కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ వారపు ప్రజావాణిలో మొత్తం 117 దరఖాస్తులు అందగా, వాటిలో 59 భూ సమస్యలకు, 10 డీడబ్ల్యూఓ, 7 డీపీఓ, 6 డీఎంఅండ్‌హెచ్‌ఓ శాఖలకు సంబంధించినవి కాగా, మిగిలినవి ఇతర శాఖలకు చెందినవని తెలిపారు. అన్ని దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

**యాదాద్రి భువనగిరిలో..**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 113 అర్జీలను స్వీకరించారు. రెవిన్యూ శాఖ 65 , జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ 15, మున్సిపాలిటీ 7, సర్వే ల్యాండ్స్ 4, సంక్షేమ శాఖ 3, వైద్య ఆరోగ్య శాఖ 3, ఇరిగేషన్ 2, డి. సి.ఓ 2, డి.పి.ఓ 2, వ్యవసాయ, విద్య, మైన్స్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆర్ అండ్ బి , మార్కెటింగ్, హౌసింగ్, సివిల్ సప్లై, జిఎం ఇండస్ట్రీస్, పశుసంవర్ధక శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, డిప్యూటీ కలెక్టర్ కృతిక, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దక్షిణేశ్వర స్వామికి 108 ద్రవ్యాలతో అభిషేకాలు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** పట్టణంలోని శ్రీ పార్వతి సమేత దక్షిణేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం 108 ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. దేవాలయ కమిటీ చైర్మన్ రత్నాపురం శ్రీశైలం మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయమంతా పూలమాలలతో అలంకరించి విద్యుత్ కాంతులు వాటర్ సదుపాయాలు భక్తులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు ఎర్రగుంట గోవర్ధన్, ఎన్విడి నాగేశ్వరరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్, స్థానిక కౌన్సిలర్ చల్ల గురుగుల కృష్ణవేణీ రఘుబాబు, భువనగిరి పట్టణ ఇన్స్పెక్టర్ రమేష్, బిఆర్ఎస్ కౌన్సిలర్ చెన్న స్వాతి మహేష్, మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, బిజెపి పట్టణ అధ్యక్షులు రత్నాపురం బలరాం, దేవరకొండ నరసింహ చారి, గౌటి మల్లికార్జున్, పూస అంజన్, దోసపాటి మురళి, సోమి గారి రాజేష్, రాచమల్ల శరత్, రత్నాపురం సాయి మనోజ్, రత్నాపురం నీలకంఠ, ఉదయ్, సామల సాయి పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వాలని నిరసన ప్రదర్శన



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పట్టణంలోని సింగనగూడెంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని సోమవారం భువనగిరి మున్సిపల్ కార్యాలయం ఎదుట బిఆర్ ఎస్ ఆధ్వర్యంలో లబ్ధిదారులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు, లబ్దిదారులు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో భువనగిరి మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి కృషి తో నిర్మించిన 444 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రభుత్వ అధికారులైన కలెక్టర్, ఆర్డిఓ, ఎమ్మార్వోల సమక్షంలో అర్హత గల లబ్దిదారుల నుండి లాటరీ పద్దతిలో ఇవ్వడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే లబ్ధిదారుల నుండి కొంతమందిని తీసివేసి కొత్త వారికి ఇస్తామని ఈ మధ్యకాలంలో చెప్పడం జరిగిందని దానికి అనుగుణంగా ఇప్పుడు అధికారులు విచారణ పేరుతో ఎప్పుడో 10 సంవత్సరాల క్రితం ప్లాటు కొనుక్కొని అమ్మివేసినా కూడా దానిని సాకుగా చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులవృత్తుల పేరిట గత ప్రభుత్వంలో వారి పేరు మీద మీటర్ ఉంటే ఫ్రీ కరెంటు ఇవ్వడం జరిగింది దానికిగాను కొంతమంది మీటర్లు వారి పేరు మీద అప్లై చేసుకొని ఫ్రీ కరెంటు పొందడం జరిగింది అయితే ఇప్పుడు అధికారులు మీకు మీటర్ ఉందంటే ఇల్లు ఉన్నట్టే అని చెప్పి వారినీ అనర్హులుగా చూపడానికి కారణాలు వెతుకుతున్నారని అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాశ్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## 12.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

**ముద్ర, హైదరాబాద్:** విద్యుత్ మౌలిక వసతుల బలోపేతంలో భాగంగా రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఉన్న 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 12.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం విజయవంతంగా ప్రారంభించారు.టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సామర్థ్య పెంపుతో సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ, బాలాజీ నగర్, జెడ్పీ రోడ్, విశ్వేశ్వరయ్య కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 22 వేల మంది విద్యుత్ వినియోగదారులు ప్రయోజనం పొందనున్నారు.కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌తో విద్యుత్ లోడ్ సమర్థవంతంగా పంపిణీ కావడంతో పాటు పీక్ అవర్స్‌లో వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు తగ్గనున్నాయని అధికారులు తెలిపారు. విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ మౌలిక వసతుల ఆధునికీకరణ, సబ్‌స్టేషన్ల సామర్థ్య పెంపు కార్యక్రమాలు కొనసాగనున్నట్లు వెల్లడించింది.

## తైక్వాండో - క్రీడాకారులకు వరం



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** తాండూర్ పట్టణం ఖంజపూర్ సమీపంలో తెలంగాణ రెసిడెన్సియల్ స్కూల్ లో తైక్వాండో శిక్షణ తరగతులను వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, మాస్టార్ మనోహర్ చేతులు మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ తైక్వాండో వల్ల శరీరంలో వేగం, చురుకు దనం, బ్యాలెన్స్ పెరుగుతాయని అన్నారు. కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపల్ ప్రవీణ రెడ్డి,సీనియర్ జర్నలిస్ట్ నరసింహ, పిఈటి అఖిల కోచ్ లు కుశల్, ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రౌ ఓపెన్ యూనివర్సిటీలో ఎంబీఏ ప్రవేశ పరీక్ష

## దరఖాస్తులకు ఆగస్టు 5 వరకు గడువు

**ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 3:** డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (BRAOU) నిర్వహించే ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు ఆగస్టు 5 చివరి తేదీ అని విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా. వై. వెంకటేశ్వర్లు తెలిపారు.ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశానికి తెలంగాణ ఐసెట్ లేదా BRAOU CETలో అర్హత సాధించడం తప్పనిసరి. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 45 శాతం మార్కులు సాధించి ఉండాలి.ప్రవేశ పరీక్షలో అర్హత పొందిన వారు అపోలో, కిమ్స్, డెక్కన్ మెడికల్ కాలేజ్, ఆర్వీఎం, రెనోవో ఆస్పత్రుల్లో నిర్వహించే హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సులతో పాటు విశ్వవిద్యాలయం జనరల్ ఎంబీఏలో కూడా ప్రవేశం పొందవచ్చు.మరిన్ని వివరాలకు 040-23680333 / 040-23680555 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదినం

**ముద్ర ప్రతినిధి, తాండూర్:** తాండూర్ నియోజకవర్గం అభివృద్ధి కొరకై కృషి చేస్తున్న నిజమైన ప్రజా సేవకుడు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అని తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ అన్నారు. ఆగస్టు 5న స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని గత మూడు రోజులుగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ పార్టీ నాయకులతో కలిసి పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.అందులో భాగంగా మూడో రోజు సోమవారం హైదరాబాద్ రోడ్డు మార్గంలోని మాతా శిశు ఆసుపత్రిలో రోగులకు పేదలకు అల్పాహారాన్ని, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఎల్లప్పుడు నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కొరకు ఆలోచించే నాయకుడు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అని ఆమె కొని ఆడారు. ఆగస్టు 5న జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో సేవ కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బాతుల నాగరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేణు కుటుంబానికి నామ ట్రస్ట్ 50 వేల ఆర్థిక సాయం



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్స్ నోటిఫికేషన్లు విడుదల చేయడం లేదని ఆవేదనతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నిరుద్యోగ యువకుడు వేణుకుమార్ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో నామ ముత్తయ్య ట్రస్టు ద్వారా 50 వేల ఆర్థిక సహాయం అందించారు. వేణుకుమార్ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు చలించిపోయి తన నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ.50 వేల రూపాయలు సోమవారం మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, ట్రస్ట్ ప్రతినిధి కనకమేడల సత్యనారాయణ చేతుల మీదుగా వేణుకుమార్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, నిరుద్యోగ యువత ధైర్యంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఆపద సమయంలో అండగా నిలిచి వెంటనే ఆర్థిక సహాయం అందించిన నామకు వేణుకుమార్ కుటుంబ సభ్యులు, నిరుద్యోగ యువత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోరంపూడి ప్రసాద్‌రావు, గద్దం వెంకటేశ్వర్లు, వాకదాని కోటేశ్వరరావు, పెనుగొండ కొండలు, నామ వ్యక్తిగత కార్యదర్శి నాగరాజు, బీఆర్ఎస్ యువజన నాయకులు రేగళ్ల కృష్ణప్రసాద్, పగడాల రవికుమార్, షారుఖ్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వేణుకుమార్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కందాళ



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** కూసుమంచి మండలం రాజుపేట స్వగ్రామంలో నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు 'తీజ్' పండుగ ప్రతీక అని కొనియాడారు.లంబాడీల ఆచార వ్యవహారాలు ఎంతో విశిష్టమైనవని,ప్రతి ఒక్కరూ గిరిజన సంస్కృతిని గౌరవించికాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పూజల్లో పాల్గొని, అక్కడి యువతులు, మహిళలు పాడిన సాంప్రదాయ పాటలు, నృత్యాలను తిలకించి వారిని అభినందించారు.

## రూ.20 లక్షల విలువైన 102 మొబైళ్లను బాధితులకు అందజేత

**ముద్ర, సూర్యాపేట, ఆగస్టు 3:** జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 14వ సెల్‌ఫోన్ రికవరీ మేళాలో సుమారు రూ.20 లక్షల విలువైన 102 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ బాధితులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, గత ఏడాదిలో 1,846 మొబైళ్లను, ఇప్పటివరకు రూ.4.80 కోట్ల విలువైన ఫోన్లను రికవరీ చేసి యజమానులకు అప్పగించామని తెలిపారు. మొబైల్ పోయిన వెంటనే CEIR పోర్టల్లో నమోదు చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని, డ్రగ్స్ నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆరోపించారు. ప్రజల ఆశలకు అనుగుణంగా హామీలను అమలు చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా పాలన సాగించడం లేదని ఆయన తెలిపారు. ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సురేష్ మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం మినహా మహిళలకు ఇచ్చిన నెలకు రూ.2,500, తులం –బంగారం, పింఛన్ల పెంపు, యువతకు స్కూటీల పంపిణీ సహా ఏ హామీ నెరవేరలేదని అదేవిధంగా రెండు లక్షల రుణమాఫీ లోపభూయిష్టంగా ఉందన్నారు. పంటల బీమా, రైతు బీమా తదితర పథకాలను ప్రభుత్వం అమలు చేయలేదని ఆయన –తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే సీతారామ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడంతో తీవ్ర జాప్యం జరిగిందని ఈ ప్రాజెక్టు విషయంలో బిఆర్ఎస్ బాటనే కాంగ్రెస్ పయనిస్తుందన్నారు. ఎల్నినో ప్రభావంతో కరువు ఛాయలు నెలకొన్న నేడు సీతారామ పూర్తయి ఉంటే ఈ జిల్లా సస్యశ్యామలం "అయి ఉండేదని సురేష్ తెలిపారు. ఈ ఏడాది కూడా అరకొర కేటాయింపులు చేశారని ట్రయల్ రన్ నిర్వహించి ఏడాది దాటినా నీటిని అందించకపోవడం ప్రభుత్వ వైఫల్యంగానే భావించాలన్నారు. ఇప్పటికైనా సీతారామను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి నిధులు కేటాయించాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. ఈనెల ఆరు నుంచి 13 వరకు జాతీయ సమితి పిలుపులో భాగంగా సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార జైత్ర యాత్రను నిర్వహించనున్నట్లు సురేష్ తెలిపారు జిల్లా వ్యాప్తంగా ఈ పాదయాత్రలు నిర్వహించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా –సమస్యలను గుర్తించడంతో పాటు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి చైతన్యవంతం చేయనున్నామని తెలిపారు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, అజ్మీర రామ్మూర్తి పాల్గొన్నారు.

## రూ.40 వేల ఆర్థికసాయం



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లికి చెందిన గంది సంపత్‌కు చికిత్స కోసం కేఎంపీ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో సేకరించిన రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం స్థానిక సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి అందజేశారు.సంపత్ గత ఐదేళ్లుగా స్పైనోసెరెబెల్లార్ అటాక్సియా అనే అరుదైన జన్యు సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో కేఎంపీ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు విరాళాలు సేకరించి సహాయం అందించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 04.08.2026
www.mudranews.in | @mudranews

8 జనరల్ న్యూస్
GENERAL NEWS

### తిన్నది ఒంటబట్టడానికి

బాగా నమిలి తినండి. ఆహారాన్ని తొందరగా మింగేయకుండా ప్రతి ముద్దను బాగా నమిలి తింటే జీర్ణక్రియ సులభమవుతుంది. దీంతో పోషకాలు శరీరానికి మెరుగ్గా అందుతాయి.



# శిశువుకు తల్లిపాలే సురక్షితం

**కలెక్టర్ ప్రతిమా సింగ్ స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్ల పరిశీలన**

**ముద్ర ప్రతినిధి, మెదక్:** తల్లిపాలు శిశువుకు సురక్షితమైనవి, స్వచ్ఛమైనవి, పోషక విలువలు కలిగినవని, శిశువు ఆరోగ్యవంతంగా ఎదగడానికి తల్లిపాలే బలమైన పునాదిగా నిలుస్తాయని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. కలెక్టరేట్లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ఉత్సవాల పోస్టర్స్ ను అదనపు కలెక్టర్ నగేష్ తో కలసి ఆవిష్కరించి, తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి తల్లి తన బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపే తల్లిపాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ హేమ భార్గవి, డిసిహెచ్ఎస్ డా.శివ దయాల్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, ఏఎంఓ రాజు, డిఎంహెచ్ఓ డా.గణేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.




**జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత**

కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆధ్వర్యంలో విదేశీ కలుపు మొక్కల నిర్మూలన కార్యక్రమంఈకో ఫాన్ సొసైటీ ఆధ్వర్యంలో గుర్తింపు, అవగాహన, నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్,అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కలెక్టరేట్ ఆవరణలో పెరిగిన కలుపు మొక్కలను గుర్తించి తొలగించారు. సిఈఓ మెట్టు సాయి సంపత్ కలుపు మొక్కలు వ్యవసాయ దిగుబడులను తగ్గించడం, సాగుభూములను ఆక్రమించడం, చెరువులు, కుంటలు, కాలువలు వంటి జల వనరులను దిగ్బంధించడం, అడవుల్లో స్థానిక వృక్షజాతులను అణచివేయడం, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీయడం, కార్చిచ్చుల ప్రమాదాన్ని పెంచడం, రైతులు, గ్రామీణ ప్రజల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని వివరించారు.

**ప్రజా సమస్యలను పరిష్కరించాలి**

ప్రజా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా నలుమూల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలన్నారు.

**స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా, పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సంపూర్ణ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్లో జరిగే జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. వేదిక, అతిథుల సీటింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై జాప్యం వద్దు

**అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, ఒక్కో అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, కుటుంబ, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను సమర్పించారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని, ప్రతి వినతిదారునికి వారి ఫిర్యాదు పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని అదనపు ఎస్పీ పేర్కొన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడం, ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించడం మెదక్ జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి భయం, సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ హామీ ఇచ్చారు.

## బీజేపీ ఎస్టీ మోర్చా సిద్దిపేట జిల్లా కమిటీ





**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** భారతీయ జనతా పార్టీ ఎస్టి మోర్చా సిద్దిపేట జిల్లా కమిటీని సోమవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ప్రకటించారు.బిజెపి ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నునావత్ మోహన్ నాయక్,ఉపాధ్యక్షులుగా వనం యాదయ్య,అజ్మీర ధనరాజ్ ,బానోత్ అనిల్ నాయక్,ప్రధాన కార్యదర్శులుగా బానోత్ సంతోష్ నాయక్,గుగులోతు లకృతి నాయక్,కార్యదర్శులుగా చెదిరి రాజు ,బుక్క రవి,మాలోతు రమేష్,మీడియా కన్వీనర్ గా ముదావత్ సంతోష్ నాయక్,కోశాధికారిగా మాలోతు తిరుపతి నాయక్,కార్యవర్గ సభ్యులుగా మాలోతు సురేష్ నాయక్ ఉండాడి శ్రీను,బానోతు సుమన్ నియామకమైనట్టు అధ్యక్షుడు ప్రకటించారు.

# ప్రతి వంటకం రుచిగా ఉండాలి

*** మరోసారి రసం పలుచగా ఉంటే చర్యలు తీసుకుంటాం**
*** మైనారిటీ గురుకులాన్ని సందర్శించిన కలెక్టర్ హైమవతి**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** గురుకులాల్లో కామన్ డైట్ మెను పాటిస్తూ, వండిన ప్రతి వంటకం రుచికరంగా వండాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి అధికారులను ఆదేశించారు.సోమవారం సిద్దిపేట అర్బన్ మండలం రంగదాంపల్లి శివారులోని తెలంగాణ అల్పసంఖ్యాకుల బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఅన్నం, ఆలుగడ్డ టమాట, పప్పు, రసం, పెరుగు లను నాణ్యత ను పరిక్షిస్తూ పప్పు పలుచగా ఉందని అసహనం వ్యక్తం చేస్తూ మరొక సారి పునరావృతం కాకూడదని చేసిన ప్రతి వంటకం నాణ్యతగా రుచికరంగా ఉండాలని వంట సిబ్బందిని హెచ్చరించారు.కామన్ డైట్ మెనూలో భాగంగా పిల్లలకు గుడ్డు ఎందుకు పెట్టలేదని ఆరా తియ్యగా, రోజు సాయంత్ర భోజనంలో పెడతామని ప్రిన్సిపల్ కలెక్టర్ కి తెలపగా సాయంత్రం మెనులో తప్పనిసరిగా గుడ్డు, నెయ్యి తో భోజనం పెట్టాలని, కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని, ప్రతి రోజు విద్యార్థుల హాజరు ప్రకారం ఫుడ్ కమిటీ సమక్షంలో సరుకులు అందిస్తూ, చేసిన ప్రతి వంటకం విద్యార్థులకు సరిపోయేలా ఉండాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు.అనంతరం స్టోర్ రూమ్ లో కూరగాయలు, బియ్యం, ఇతర వంట దినుసులను తనికి చేస్తూ అన్ని కూరగాయలు సక్రమంగా ఉన్నాయని చట్నీ సైతం చేసి విద్యార్థులకు పెట్టవచ్చని సూచించారు. వంట గదీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## పే స్కేల్ ఇవ్వకపోతే ఆగస్ట్ 15 నుంచి సమ్మె

**ఉపాధి హామీ ఉద్యోగుల అల్టిమేటం**




**ముద్ర, సిద్దిపేట :** ఉపాధి హామీ జీ రాంజీ ఉద్యోగులకు ప్రభుత్వం పే స్కేల్ ఇవ్వకపోతే ఆగస్ట్ 15 నుండి సమ్మెకు దిగుతామని ఉపాధి హామీ ఉద్యోగుల జాయిన్ యాక్షన్ కమిటీ నాయకుడు మల్లారెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణి లో దరఖాస్తు అందించారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తమకు పే స్కేల్ ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టో లో ఉద్యోగ బాధ్యత్రకు హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మోసం చేస్తున్నదని మండిపడ్డారు. గతంలో మంత్రి సీతక్క పే స్కేల్ ఇస్తామని చెప్పి హామీ ఇచ్చి కూడా హామీ నిలబెట్టుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశాం. గత నాలుగు రోజులుగా పెన్ డౌన్ చేసి నిరసన తెలుపుతున్నామని అన్నారు. ఈ ఆగస్ట్ 15 వారకు ప్రభుత్వానికి డెడ్ లైన్ ఇస్తున్నమని పే స్కేల్ ప్రకటించపోతే సమ్మెకు వెలుతామని హెచ్చరించారు. గత మూడు నెలల నుండి జీతాలు లేక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారాన్నారు. అప్పులు తెచ్చి కుటుంబాలు పోషించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలు పరిష్కారించకపోతే సమ్మె తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఉపాధి హామీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## వైభవంగా పలారం బండి ఉత్సవం

**పాల్గొన్న ఎమ్మెల్యే డా.రోహిత్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ పట్టణ ప్రజల ఆరాధ్య దైవం మాత నల్ల పోచమ్మ దేవి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పలారం బండి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం బోరంచమ్మ ఆలయం వద్ద అర్చకులు శ్రీనివాస్ చారి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. పోతారాజుల నృత్యాలు కాంతారా కళాకారులు, మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు సత్కరించారు. యువకులతో కలిసి నృత్యం చేసి అలరించారు. వెంట మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధికభూపతిరాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షులు గంగాధర్, హరిత, అఖిల భారత్, రాగి అశోక్ ఉన్నారు. బీఆర్ఎస్ నేత కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బోరంచమ్మ ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెదక్‌లో తొలిసారిగా నల్లపోచమ్మ తల్లికి ఫలహారం బండి నిర్వహించడం ఆనందదాయకమన్నారు. వెంట మున్సిపల్ కౌన్సిలర్లు మామిళ్ళ ఆంజనేయులు, జుబేర్ అహ్మద్, దీపక్ కుమార్, ఉదయ్ కుమార్, లక్ష్మీ స్వరాగిని ఉన్నారు.



# హరీశ్‌రావుపై వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలి

**సాయి ప్రేమ్ సామల్ల**
**హరీష్ రావుపై చేసిన వ్యాఖ్యలకు సామ రాం మోహన్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** మాజీ మంత్రి హరీష్ రావుపై కాంగ్రెస్ నాయకుడు సామ రామ్ మోహన్ రెడ్డి చేసిన తాంత్రిక పూజల ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, అవి ఇంజినీరింగ్ విద్యార్థులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన "క్రిమినల్ వేస్ట్" వ్యాఖ్యలను ప్రజల దృష్టి నుంచి మళ్లించేందుకు చేసిన రాజకీయ ప్రయత్నమని బీఆర్ఎస్ యువ నాయకుడు సాయి ప్రేమ్ సామల్ల ఆరోపించారు. సోమవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హరీష్ రావు రాష్ట్ర ప్రజల సంక్షేమం, రైతుల శ్రేయస్సు కోసం దేవాలయాలను సందర్శించి ప్రార్థనలు చేస్తారని, వాటిని క్షుద్రపూజలు లేదా తాంత్రిక పూజలుగా చిత్రీకరించడం కాంగ్రెస్ నాయకుల రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. హరీష్ రావు సిద్దిపేటను అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడని, రైతుల కోసం కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులను నిర్మించిన వ్యక్తిపై ఇలాంటి ఆరోపణలు చేయడం తగదన్నారు. అధికార వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే తాంత్రిక పూజల పేరుతో రాజకీయ డ్రామా చేస్తున్నారని అన్నారు. సామ రామ్ మోహన్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది కేవలం హరీష్ రావును అవమానించడం మాత్రమే కాకుండా తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. లేనిపక్షంలో న్యాయపరంగానూ, ప్రజాక్షేత్రంలోనూ తగిన విధంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీలు కీసర పాపయ్య, వేణుగోపాల చారి, సర్పంచులు దేవయ్య, రాజు, మాజీ ఉపసర్పంచ్ మహేందర్ రెడ్డి, విద్యార్థి యువ నాయకులు నరేష్, రాజశేఖర్, భాను చందర్, శ్రీనివాస్ రెడ్డి, రాజు యాదవ్, తొట్ల స్వామి, గొడుగు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## 6న గద్దర్ వర్ధంతి సభను విజయవంతం చేయండి

**.పోస్టర్ ఆవిష్కరించిన గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** ఈనెల 6 న సిద్దిపేటలో, హైదరాబాద్ లో జరిగే ప్రజాయుద్ధ నౌక గద్దర్ వర్ధంతి సభను విజయవంతం చేయాలని గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ పిలుపునిచ్చింది. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో వర్ధంతి సభ పోస్టర్ ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమం లో కమిటీ చైర్మన్ పోచబోయిన శ్రీహరి, కో చైర్మన్ ఆస లక్ష్మణ్,TPTF రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జి. తిరుపతి రెడ్డి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షులు కె. రంగాచారి, ప్రజాగాయకులు భీమసేన, చికోటి నర్సింలు, అవని పత్రిక సంపాదకులు కూతురు రాజిరెడ్డి, పౌరహక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మంజీరా రచయితల సంఘం ప్రధానకార్యదర్శి సిద్దెంకి యాదగిరి, తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు పొన్నాల బాలయ్య,BC సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కంకిటి నవీన్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దాస అంజయ్య, BRS నాయకులు గుండు శ్రీనివాస్, తెలిజీరు శ్రీనివాస్ యాదవ్, గడీల రమేష్ రెడ్డి, చిటుకుల మైసా రెడ్డి తదితరులు కలిసి పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్ పోచబోయిన శ్రీహరి యాదవ్, కో చైర్మన్ ఆస లక్ష్మణ్ లు మాట్లాడుతూ తన 60 ఏండ్ల జీవితాన్ని ప్రజలకు, ప్రజా యుద్దానికి, పీడిత ప్రజల విముక్తి కోసం అంకితం చేసి, ప్రజలకు తన పాటను అంకితం చేసిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ భౌతికంగా దూరమై మూడేళ్లు గడుస్తున్నాయని చెప్పారు.. ఆయన భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు, ఆయన బోధించిన ఆకాంక్షలు, ఆయన పాట ఇంకా ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నాయని అన్నారు. ప్రజాయుద్ధ నౌక గద్దర్ కు మరణం లేదని తెలిపారు. ఆయన చూపించిన మార్గంలో అసమ సమాజాన్ని అంతం చేసే వరకు ప్రజల పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగించడం కోసం గద్దర్ కుమారుడు సూర్యం ఆధ్వర్యంలో గద్దర్ ఫౌండే షన్ ఏర్పడిందని తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6 న హైదరాబాద్ రవీంద్రభారతి లో సాయంత్రం 4 గంటలకు వర్ధంతి సభ జరుగుతుందని తెలిపారు.. అదేరోజు ఉదయం 8 గంటలకు సిద్దిపేటలో గద్దర్ విగ్రహం ఏర్పాటుకు ప్రతి పాదించిన స్థలం లో సిద్దిపేట గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ రెండు వర్ధంతి కార్యక్రమాల్లో గద్దర్ అభిమానులు, కవులు, రచయితలు, కళాకారులు,గాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు..

# ప్రభుత్వ భూమి ఆక్రమణపై గ్రామస్తుల ఆందోళన



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా హవేళీ ఘణాపూర్ మండలం పోచంరాల్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్‌కు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తుల వివరాల ప్రకారం, మిరుగుడుపల్లి గ్రామ శివారులో సుమారు 16 ఎకరాలు, సర్దన రెవెన్యూ శివారులో సర్వే నంబర్ 807లో సుమారు 9 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. గతంలో ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం పర్యాటక ప్రాంతంగా గుర్తించడంతో పాటు పోచారం డ్యాం ముంపు ప్రాంతంగా కూడా ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ భూమిని రైతులు పంట కోత సమయంలో ధాన్యం ఆరబెట్టేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రంగా, గ్రామ పశువులు, అటవీ జంతువుల మేత కోసం వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. అయితే ఇటీవల హెచ్ఐఎస్ ఆరో దర్శన్ ట్రస్ట్, హైదరాబాద్ పేరుతో ఈ ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై గతంలో తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయగా 2022 సెప్టెంబర్ 20న అధికారులు స్థలాన్ని పరిశీలించి భూమి ప్రభుత్వానిదేనని నిర్ధారించి ఫెన్సింగ్ పనులను నిలిపివేశారని గుర్తు చేశారు. అయినప్పటికీ మళ్లీ ఆక్రమణ ప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిపై జరుగుతున్న ఆక్రమణను వెంటనే అడ్డుకుని, సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే ఆ భూమిని పోచంరాల్ గ్రామ ప్రజల అవసరాల కోసం శాశ్వతంగా కేటాయించాలని సర్పంచ్ రాజు, గ్రామస్తులు కోరారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555